ANN తెలుగు

Follow: @ANNTELUGU

24-08-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 261 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

manepally Jewellers Pvt. Ltd. trusted legacy since 1890

శ్రావణ మాసం సంబరాలు



# భారత్‌లో జర్మన్ బ్రాండ్ హవా...

## ధర ఎక్కువైనా రికార్డ్ సేల్స్




జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ 'బీఎండబ్ల్యూ'.. భారతదేశంలో ఇప్పటి వరకు 5,000 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించినట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఇండియాలో ఆరు EVలను విక్రయిస్తున్న సంస్థ.. నవంబర్ 2021లో iXతో దేశీయ లగ్జరీ ఈవీ రంగంలోకి ప్రవేశించింది. కార్ల అమ్మకాలను మాత్రమే కాకుండా.. బీఎండబ్ల్యూ 4,000 కి.మీ పవర్ ఛార్జింగ్ కారిడార్ కూడా ప్రారంభించింది. కంపెనీ ఛార్జింగ్ కారిడార్ జమ్మూ నుంచి మధురై వరకు విస్తరించి, జాతీయ రహదారులు & ఢిల్లీ, జైపూర్, అహ్మదాబాద్, ముంబై, పూణే, బెంగళూరు, కోయంబత్తూర్, మధురై వంటి నగరాలను కవర్ చేస్తుంది. ఇది 120 kW నుంచి 720 kW వరకు సామర్థ్యాలతో ఛార్జర్‌లను కలిగి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో మొత్తం 6000 ఛార్జింగ్ స్టేషన్స్ ఉన్నట్లు సమాచారం. బీఎండబ్ల్యూ ఛార్జింగ్ స్టేషన్స్ కోసం మైబీఎండబ్ల్యూ యాప్ ద్వారా సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు.

**మూడు శాతం పెరిగిన బీఎండబ్ల్యూ ధరలు**

బీఎండబ్ల్యూ.. భారతదేశంలోని తన మొత్తం వాహనాల ధరలను 2025 సెప్టెంబర్ 1 నుంచి 3 శాతం పెంచనున్నట్లు ప్రకటించింది. నిరంతర విదేశీ మారక ద్రవ్య హెచ్చుతగ్గులు & ప్రపంచ సరఫరా గొలుసు ఒత్తిళ్ల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

# మైక్రోసాఫ్ట్‌కు పోటీగా మాక్రోహార్డ్?

## ఎలాన్ మస్క్ ప్లాన్ ఇదేనా..




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఎప్పుడూ.. కొత్త విషయాల మీద ఆసక్తి చూపుతుంటారు. ఇప్పుడు తాజాగా మైక్రోసాఫ్ట్ పేరు మాదిరిగా అనిపించే 'మాక్రోహార్డ్' (Macrohard) పేరును తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. దీనికి సంబంధించిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎక్స్ఏఐ(xAI)లో చేరి.. మాక్రోహార్డ్ అనే పూర్తిగా ఏఐ సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్మించడంలో సహాయం చేయండి. ఇది సాధారణ పేరు, కానీ ఈ ప్రాజెక్ట్ వాస్తవమైనది. మైక్రోసాఫ్ట్ వంటి సాఫ్ట్‌వేర్ కంపెనీలు స్వయంగా ఎటువంటి ఫిజికల్ హార్డ్‌వేర్‌ను తయారు చేయలేదు. కానీ వాటిని పూర్తిగా ఏఐతో సృష్టించడం సాధ్యమవుతుంది'' అని మస్క్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఆగస్టు 1న యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ కార్యాలయంలో 'మాక్రోహార్డ్' పేటెంట్ కోసం మస్క్ xAI దాఖలు చేసింది. ఇది పూర్తిగా ఏఐ ద్వారానే పనిచేస్తుంది. ఇందులో కృత్రిమ మేధస్సును ఉపయోగించి వీడియో గేమ్‌లను రూపొందించడం, కోడింగ్, రన్నింగ్, గేమ్స్ కోసం డౌన్‌లోడ్ చేయగల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ మొదలైనవి ఉన్నాయి. గత నెలలో Xలో ఒక పోస్ట్‌లో.. ''xAI లేటెస్ట్ AI సాఫ్ట్‌వేర్ కంపెనీ, వందలాది ప్రత్యేక కోడింగ్ మరియు ఇమేజ్ / వీడియో జనరేషన్ /అండర్‌స్టాండింగ్ ఏజెంట్లు అన్నీ కలిసి పనిచేస్తాయి. ఫలితం అద్భుతంగా వచ్చే వరకు వర్చువల్ మెషీన్లలో సాఫ్ట్‌వేర్‌తో పరస్పర చర్య చేసే మానవులను అనుకరిస్తాయి" అని మస్క్ అన్నారు గత కొన్ని సంవత్సరాలుగా మైక్రోసాఫ్ట్ సంస్థను మస్క్ సందర్భం వచ్చినప్పుడు విమర్శిస్తూనే ఉన్నారు. ఇటీవల మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంగా ఉన్న ఓపెన్ఏఐ తాజాగా విడుదల చేసిన చాట్‌జీపీటీ5 మోడల్ ఎంతో సమర్థంగా పని చేస్తుందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనిపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ త్వరలో ఓపెన్ఏఐ మైక్రోసాఫ్ట్‌ను నాశనం చేస్తుందని చెప్పారు. ఇప్పుడు మైక్రోసాఫ్ట్‌కు పోటీగా మాక్రోహార్డ్ తీసుకొస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఇన్‌కమ్

# ట్యాక్స్ బిల్లు: రాష్ట్రపతి ఆమోదం

ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం 1961లో మార్పులు చేస్తూ.. కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025ను కేంద్రం ఫిబ్రవరి 13న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు 2025కు ఈ నెల 12న ఆమోదం లభించింది. బైజయంత్ పాండా నేతృత్వంలోని 31 మంది సభ్యుల సెలెక్ట్ కమిటీ చేసిన అనేక సిఫార్సుల ఆధారంగా ఇందులో మార్పులు చేశారు. ఈ కొత్త ఆదాయపన్ను చట్టం, 2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఆదాయపన్ను చట్టం, 1961 స్థానంలో కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పాత చట్టంతో పోల్చితే కొత్త చట్టం సరళతరంగా, పారదర్శకంగా ఉంటుందని ఆదాయపన్ను శాఖ 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించింది.

**పాత vs కొత్త బిల్లు మధ్య తేడాలు**

పాత ఆదాయపు పన్ను చట్టం, 1961.. దశాబ్దాలుగా అమలులో ఉంది. అయితే అందులోని భాష, నిర్మాణం వంటివన్నీ సామాన్యులకు కొంత గందరగోళంగా ఉన్నాయి. దీనిని పూర్తిగా మార్చాలనే ఉద్దేశ్యంతో కొత్త బిల్లును తీసుకువచ్చారు. ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం, 1961లో మొత్తం 47 అధ్యాయాలు ఉన్నాయి. కొత్త బిల్లులో.. అధ్యాయాల సంఖ్యను కేవలం 23కి తగ్గించారు. దీనివల్ల చదవడం, అర్థం చేసుకోవడం సులభం అవుతుంది. ఈ మార్పు ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు, నిపుణులకు ఉపశమనం కలిగిస్తుంది. ఇకపై మునుపటి సంవత్సరం & అసెస్‌మెంట్ సంవత్సరం వంటి పదాలకు బదులు "పన్ను సంవత్సరం" అనే పదం వాడుకలోకి వస్తుంది. 2025 కొత్త పన్ను బిల్లులో ఇంతకు ముందు ఉన్న శ్లాబులు, రేట్లు అలాగే ఉంటాయి. ఐటీఆర్ ఫైలింగ్ గడువు తేదీలు, ఆదాయ పన్ను శ్లాబులలో కూడా ఎలాంటి మార్పు లేదు. కొత్త బిల్లులో, సంక్లిష్టమైన చట్టపరమైన భాషకు బదులుగా, పన్నును సులభంగా లెక్కించగల సూత్రాలు, పట్టికలను ఇవ్వడం జరిగింది. దీనివల్ల పన్ను చెల్లింపుదారులు ఎంత పన్ను చెల్లించాలో.. ఎలా చెల్లించాలో అర్థం చేసుకోవడం సులభం అవుతుంది.




## బంగారం విలువపై 90 శాతం లోన్

ప్రైవేటు రంగంలోని సౌత్ ఇండియన్ బ్యాంక్ 'ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్' పేరుతో కొత్త బంగారం రుణ పథకాన్ని ప్రారంభించింది. బంగారం విలువపై 90% వరకు రుణాన్ని ఈ పథకం కింద పొందొచ్చు. రూ.25,000 నుంచి రూ.25 లక్షల వరకు రుణం, గరిష్ఠంగా మూడేళ్ల కాలానికి తీసుకోవచ్చు. ఎంఎస్ఎంఈలు, నాన్ ఎంఎస్ఎంఈలు, చిన్న సంస్థలు తమ వ్యా పార విస్తరణ, మూలధన అవసరాల కోసం రుణాలు తీసుకోవచ్చని సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. ఎలాంటి రహస్య చార్జీల్లేకుండా, పారదర్శకంగా ఈ రుణ పథకం ఉంటుందని తెలిపింది. మొత్తం ప్రక్రియ డిజిటల్‌గా పూర్తవుతుందని, మొదటిసారి రుణం తీసుకునే వారు కూడా అర్హులేనని పేర్కొంది.

## ఈ కారుకు భారీ డిమాండ్: మూడు నిమిషాల్లో అన్నీ కొనేశారు



మహీంద్రా అండ్ మహీంద్రా వార్నర్ బ్రదర్స్ సహకారంతో రూ. 27.79 లక్షల (ఎక్స్‌షోరూమ్) ధరతో బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్‌ను లాంచ్ చేసింది. కంపెనీ ఈ స్పెషల్ ఎడిషన్‌ను 999 యూనిట్లకు పరిమితం చేసింది. కాగా కంపెనీ దీని కోసం ఈ రోజు బుకింగ్స్ స్వీకరించడం మొదలుపెట్టింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ కారు కోసం బుకింగ్స్ స్వీకరించడం మొదలైన 135 సెకన్లలో.. అన్నీ యూనిట్లు అమ్ముడైపోయాయి. లాంచ్ సమయంలో కేవలం 300 యూనిట్లకు మాత్రమే పరిమితమైన ఈ బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ తరువాత 999 యూనిట్లకు చేరింది. అన్ని యూనిట్లు ఇప్పుడు పూర్తిగా అమ్ముడైపోయాయి. డెలివరీలు సెప్టెంబర్ 20న ప్రారంభం కానున్నాయి. మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్.. కస్టమ్ శాటిన్ బ్లాక్ బాడీ కలర్‌తో వస్తుంది. ముందు డోర్స్ మీద బ్యాట్‌మ్యాన్ డెకాల్స్, టెయిల్‌గేట్‌పై డార్క్ నైట్ బ్యాడ్జ్, ఫెండర్‌పై బ్యాట్‌మ్యాన్ లోగో, బంపర్ & రివర్స్ లాంప్ ఉన్నాయి. బ్రేక్‌లు, స్ప్రింగ్‌లు ఆల్కెమీ గోల్డ్ పెయింట్ పొందాయి. ఇది చూడగానే ఒక సూపర్ హీరోను గుర్తుకు తెస్తుంది. మహీంద్రా బ్యాట్‌మ్యాన్ ఎడిషన్.. 79 kWh బ్యాటరీ ప్యాక్‌తో.. ఒకే ఫుల్ ఛార్జ్‌పై 682 కి.మీ రేంజ్ అందిస్తుంది. ఇందులోని ఎలక్ట్రిక్ మోటారు 286 హార్స్ పవర్, 380 న్యూటన్ మీటర్ టార్క్ ఉత్పత్తి చేస్తాయి. పనితీరు పరంగా ఉత్తమంగా ఉంటుందని సమాచారం. మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ లోపల కూడా అద్భుతమైన ఇంటీరియర్ డిజైన్ పొందుతుంది. డాష్‌బోర్డ్‌పై ఆల్కెమీ గోల్డ్‌లో నంబర్ ఉన్న బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ ప్లేక్, ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్ కోసం చార్‌కోల్ లెదర్ & గోల్డ్ సెపియా స్టిచింగ్‌తో కూడిన స్వెడ్ లెదర్ అపోల్‌స్ట్రే వంటివి ఉన్నాయి. గోల్డ్ యాక్సెంట్‌లు స్టీరింగ్ వీల్, ఇన్ టచ్ కంట్రోలర్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వరకు విస్తరించి ఉండగా, బ్యాట్ లోగో బూస్ట్ బటన్, సీట్లు మొదలైనవాటిపై కనిపిస్తాయి.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



# మరణం అంచున గాజా

### అక్కడ అత్యంత తీవ్రమైన కరువు.. యూఎన్ డబ్ల్యూఎఫ్‌పీ చీఫ్ అధికారిక ప్రకటన

### తక్షణం స్పందించకపోతే మరింత విస్తరిస్తుందని హెచ్చరిక

**గాజా స్ట్రిప్:** రెండేళ్ల యాజన్.. గాజా నగరంలోని బీచ్‌లో ఉన్న శరణార్థి శిబిరంలో ఉన్నాడు. ఆ శిబిరానికి రెండు నెలలుగా పిండే కాదు.. ఎలాంటి ఆహార సహాయం అందడం లేదు. విశాలమైన అతని కళ్లు.. ఆహారం కోసం ఎదురుచూసి.. చూసి.. అలసటతో బరువెక్కాయి. ఎముకలు తేలిన శరీరం అతని ఆకలిని చెబుతోంది. ఏడవడానికి కాదు కదా.. చివరికి తిండి తినడానికి కూడా ఓపికలేక.. చిరిగిపోయిన పరుపుపై జీవచ్ఛవంలా కూర్చున్నాడు. ఇది ఒక్క యాజన్ స్థితి కాదు.. గాజా స్ట్రిప్‌లోని పిల్లలందరి సామూహిక దుంఖః. ప్రస్తుతం గాజాలో పోషకాహార లోపం వేగంగా వ్యాపిస్తోంది. గాజా నగరంలో ఆకలి మరణాలు ఫిబ్రవరి నుంచి నాలుగు రెట్లు పెరిగాయి. ప్రస్తుతం గాజాలో 5లక్షల మంది తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిండీ మెక్ కెయిన్ హెచ్చరించారు. మధ్య ప్రాచ్యంలో అధికారికంగా కరువు నిర్ధారించడం ఇదే మొదటిసారి.

రాబోయే రోజుల్లో ఇది గాజా గవర్నరేట్ నుంచి డెయిర్ అల్ బలాహ్, ఖాన్ యూనిస్‌కు వ్యాపిస్తుందని ఆందోళన వ్యక్తంచేసింది. 'రోజుల తరబడి తినడానికి ఏమీ లేక లక్షలాది మంది బతుకీడిస్తున్నారు. పోషకాహార లోపం స్థాయి వేగంగా పెరుగుతోంది. ఆకలి మరణాలు పెరుగుతున్నాయి. ఈ సమయంలో తక్షణ, పూర్తిస్థాయి మానవతా సాయం అవసరమని ప్రపంచ ఆహార కార్యక్రమం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నొక్కి చెప్పాయి. కరువును ఎలాగైనా ఆపాలని ఆమె పిలుపునిచ్చారు. ఆ ప్రజల ప్రాణాలు కాపడేందుకు అడ్డంకులు లేని మానవతా సహాయం, తక్షణ కాల్పుల విరమణ అవసరమని సూచించారు. లేని పక్షంలో సెప్టెంబర్ చివరి నాటికి, గాజా స్ట్రిప్ అంతటా దాదాపు 7 లక్షల మంది కరువును ఎదుర్కొంటారని ఆమె హెచ్చరించారు.

**ప్రాణాంతకంగా మారిన పోషకాహార లోపం**


రెండు సంవత్సరాల సంఘర్షణ ప్రజలను పదేపదే నిరాశ్రయులను చేస్తే.. మానవతా సాయంపై ఆంక్షలు ప్రజలను ఆకలిలోకి నెట్టాయి. ఇక్కడ ఆహారం దొరకడం లేదు. జూలై, మే నెలతో పోలిస్తే ప్రజలు రెట్టింపు సంఖ్యలో ఆకలితో అలమటిస్తున్నారు. ఇక గాజా నగరంలో మూడు రెట్లు ఎక్కువైంది. ప్రతి ముగ్గురిలో ఒకరికి రోజుల తరబడి ఆహారం దొరకడం లేదు. దొరికిన కొద్ది మొత్తంతో పిల్లల కడుపు నింపి, పెద్దలు పస్తులుంటున్నారు. పిల్లల్లో పోషకాహార లోపం వేగంగా పెరుగుతోంది. నలుగురిలో ఒకరు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అది అత్యంత ప్రాణాంతకం. జూన్ 2026 చివరి నాటికి పోషకాహార లోపం వల్ల మరణించే ప్రమాదం ఉన్న పిల్లల సంఖ్య 14,100 నుంచి 43,400 కు అంటే మూడు రెట్లు పెరుగుతుంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో 98 శాతం పంట భూములు దెబ్బతిన్నాయి. వ్యవసాయం లేదు. ప్రతి పది కుటుంబాల్లో తొమ్మిది కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. జూలై నుంచి గాజాలోకి వచ్చే ఆహారం, సహాయ సామగ్రి పెరిగింది. కానీ.. అవసరంతో పోలిస్తే అది చాలా తక్కువ. సహాయ ట్రక్కుల నుంచి ఆహారం దోచుకుంటున్నారు. వంట చేసుకోవడానికి నీళ్లు కూడా లేవంటే పరిస్థితిని ఊహించొచ్చు.



**మనుషులు సృష్టించిన కరువు**

**అయితే ఈ కరువు మనుషులు సృష్టించిందని, అవకాశం ఉన్నా నివారించలేకపోవడం వెంటాడే విషయమని ఐక్యరాజ్యసమితి సహాయ అధిపతి టామ్ ఫ్లెచర్ అన్నారు. జెనీవాలో మీడియాతో మాట్లాడిన ఆయన ఇజ్రాయెల్ విధిస్తున్న అడ్డంకుల కారణంగా పాలస్తీనా భూభాగానికి ఆహారం చేరుకోలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మమ్మల్ని అనుమతిస్తే మనం నివారించగలిగే కరువు ఇది. ఇజ్రాయెల్ అడ్డంకుల కారణంగానే సరిహద్దుల వద్ద ఆహారం నిల్వలు నిలిచిపోయాయి' అని తెలిపారు.**

# భారత్ అంటే గౌరవం.. మోదీ అంటే అంత కంటే..



**న్యూఢిల్లీ:** భారత పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలా వ్యవహరిస్తున్నారో అందరికీ తెలిసిందే. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయానే ఉద్దేశంతో సుంకాల పెంపునకు నాంది పలికారనే వాదన బలంగా వినిపిస్తోంది.. భారత్‌పై వరుస సుంకాలతో ఇరుకున పెట్టే యత్నం చేస్తున్నారని అంటున్నారు పలువురు ప్రముఖులు. భారత్‌ను చైనా కంటే దారుణంగా చూడటం తగదని అంటున్నారు. చైనా కంటే అధికంగా భారత్‌పై సుంకాలు విధించడమే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. కొన్ని దశాబ్దాలుగా అమెరికాకు మిత్రదేశంగా ఉన్న భారత్ పట్ల ట్రంప్ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో ఆయనకే తెలియాలి. భారత్‌ను ఆర్థికంగా ఎదుగకుండా చూడాలని ట్రంప్ చేస్తున్నారా? అనేది ఒక క్వశ్చన్ మార్క్. అదే సమయంలో .భారత్‌పై ట్రంప్ వైఖరి పట్ల అటు అమెరికాలోనే పలు రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించగా, ఇప్పుడు దాన్ని సరిదిద్దుకోవాలనే యత్నం కూడా యూఎస్ నుంచి జరుగుతున్నట్లే కనబడుతోంది. తాజాగా అమెరికా మాజీ దౌత్యవేత్త, రాజకీయ నాయకుడు మిచెల్ బామ్‌గార్టనర్ అమెరికాభారత్‌ల 'మైత్రి' తిరిగి గాడిలో పడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ మీడియా ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మిచెల్ బామ్‌గార్టనర్ మాట్లాడుతూ.. ట్రంప్‌కు భారత్ అంటే చాలా గౌరవమని, ప్రధాని మోదీ అంటే అంతకంటే గౌరవమంటూ స్పష్టం చేశారు. ఏ రకంగా భారత్‌ను డొనాల్డ ట్రంప్ గౌరవిస్తున్నారో చెప్పకపోయినా, త్వరలోనే ఇరుదేశా మధ్య సంబంధాలు తిరిగి యథాస్థితికి వస్తాయని జోస్యం చెప్పారు. ట్రంప్ వైఖరిపై చాలాకాలం ఓపిక పట్టిన భారత్.. ఇప్పుడు మాటల యుద్ధాన్ని ఆరంభించింది. అటు కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు.. అవకాశం దొరికినప్పుడల్లా ట్రంప్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రధానంగా రష్యాతో బంధాన్ని చెడగొట్టాలని చూసిన ట్రంప్‌కు.. భారత్ అనూహ్య షాకిచ్చింది. తమకు దేశ ప్రయోజనాలే ముఖ్యమని, అందుకు రష్యాతో చమురు కొనుగోలులో ఎటువంటి మార్పు ఉండబోదనే సంకేతాలు పంపింది. దాంతో ట్రంప్‌కు నోట్లో ఎలక్కాయపడినట్లు అయ్యింది. ప్రస్తుతం నేరుగా మాట్లాడకుండా రాజీ చేసుకునే మంత్రాన్ని అమలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారనేది ప్రస్తుత పరిస్థితుల్ని బట్టి కనిపిస్తోంది. ఇటీవల ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతాన్యాహు కూడా అమెరికాభారత్ సంబంధాలు తిరిగి మెరుగు పడతాయని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని కూడా చెప్పారు. మరి ఇప్పుడు అమెరికా మాజీ దౌత్యవేత్త మిచెల్ బామ్‌గార్టనర్ సైతం అదే పల్లవి అందుకున్నారు. ఈ రెండు పెద్ద దేశాల మధ్య పలు ప్రాథమిక అంశాలు చాలా బలంగా ఉన్నాయనేది ఒప్పుకోక తప్పదన్నారు. అందువల్ల ఇరు దేశాలు తిరిగి పూర్వ స్థితిని కొనసాగించే అవకాశం చాలా ఎక్కువగా ఉందన్నారు.

## టూరిస్ట్ బస్సు ప్రమాదం.. పలువురు మృతి



**వాషింగ్టన్:** అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. టూరిస్టు బస్సు బోల్తా పడిన ఘటనలో ఐదుగురు మృతి చెందినట్టు తెలుస్తోంది. పలువురు గాయపడినట్టు అక్కడి అధికారులు తెలిపారు. ఇక, టూరిస్టుల్లో ఎక్కువ మంది భారత్, చైనా, ఫిలిప్పీన్స్‌కు చెందిన వారు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. వివరాల ప్రకారం.. అమెరికాలోని పెంబ్రోక్ సమీపంలో టూరిస్ట్ బస్సు ప్రమాదానికి గురైంది. ప్రఖ్యాత నయాగరా జలపాతం అందాలను చూసేందుకు వెళ్లి తిరిగి న్యూయార్క్‌కు వస్తున్న ఓ టూరిస్టు బస్ బోల్తా పడింది. కాగా, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపుతప్పి బోల్తా పడినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందగా, పలువురు గాయపడినట్లు స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. ఈ ఘటన అక్కడి స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.40 గంటలకు జరిగింది. ఈ క్రమంలో చాలా మంది సీటు బెల్టులను ధరించకపోవడంతో వారిని సులభంగా బస్సు నుంచి బయటికి తీసుకొచ్చినట్లు ఓ పోలీస్ అధికారి పేర్కొన్నారు. కాగా, బస్సు ప్రమాదానికి గురైన సమయంలో 54 మంది ప్రయాణిస్తున్నారు. పర్యాటకుల్లో అత్యధికులు భారత్, చైనా, ఫిలిప్పీన్స్‌కు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. బస్సు బోల్తా పడిన విషయం తెలియడంతో వెంటనే స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. నాలుగు హెలికాప్టర్‌లు, పలు అంబులెన్స్‌లలో క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఘటనతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇదొక విషాద ఘటన అని న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ పేర్కొన్నారు. తమ యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

## లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత

**లండన్/న్యూఢిల్లీ:** ప్రముఖ ప్రవాస భారతీయ పారిశ్రామిక దిగ్గజం లార్డ్ స్వరాజ్ పాల్ (94) లండన్‌లో కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఇటీవల ఆయన చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. స్వరాజ్‌పాల్ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. పరిశ్రమ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడిన దానశీలిగా ఆయన్ను అభివర్ణించారు. బ్రిటన్-భారత్ సంబంధాలను బలోపేతం చేసేందుకు స్వరాజ్ పాల్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. వ్యాపార దిగ్గజం, దానశీలి, అంతర్జాతీయంగా ప్రవాస భారతీయులకు ఆయనొక ఐకాన్ అని తెలిపారు. 1966లో కుమార్తె చికిత్స కోసం బ్రిటన్ వెళ్లిన లార్డ్ పాల్ ఆ తర్వాత అక్కడే అంతర్జాతీయ సంస్థ కపారో గ్రూప్‌ను నెలకొల్పారు. ఉక్కు, ఇంజినీరింగ్, ప్రాపర్టీ తదితర రంగాల్లో దిగ్గజంగా తీర్చిదిద్దారు. బ్రిటన్‌లో అత్యంత సంపన్న ఏషియన్‌గా ఎదిగారు. దశాబ్దాల పాటు వ్యాపార, రాజకీయ రంగాల్లో కీలకంగా నిల్చారు.

టాప్ న్యూస్

## ఓపెన్ ఏఐ


- హైదరాబాద్‌లోనే ప్రారంభించండి
- ఆ సంస్థ సీఈఓకు కేటీఆర్ స్వాగతం



04

## మంత్రులకు చంద్రబాబు ర్యాంకులు

- రామానాయుడు ఫస్ట్



04

## తగ్గేదే లేదు

- 'మూసీ' ప్రక్షాళన చేసి తీరుతాం
- నీటి వనరుల పరిరక్షణలో రోల్ మోడల్ గా తెలంగాణ
- ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది
- ఐటీపీఐ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



04


ANN తెలుగు

Follow: @ANNTELUGU

24-08-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 261 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




# ట్రంప్‌కు షాక్!

## భారీగా తగ్గిన అమెరికా వలసలు

ఆయన నిర్ణయాలు, విధిస్తున్న ఆంక్షలతో జంకుతున్న ప్రజలు

గత 65 ఏళ్లలో ఇదే తొలిసారి జరిగిన పరిణామం

మరోవైపు అమెరికాకు పోస్టల్ సర్వీసులు నిలిపేసిన భారత్

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** ట్రంప్ దెబ్బకు అమెరికాకు వెళ్లాలనుకునే ప్రపంచ దేశాల ప్రజలు వెనక్కి తగ్గుతున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, విధిస్తున్న ఆంక్షలతో అమెరికా అంటేనే భయపడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా వెల్లడైన ఓ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. ఈ ఏడాది తొలి 6 నెలల్లో ఏకంగా 15 లక్షల మంది అమెరికాకు వలసదారులు తగ్గిపోయారని తెలిపింది. గత 65 ఏళ్లలో ఇదే తొలిసారి జరిగిన పరిణామమని పేర్కొంటున్నారు.

మిగతా 5లో


SRI GOLD
TRUSTED GOLD BUYERS


**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,00,530 |
| 22 క్యారెట్ | 92,150 |
| సిల్వర్ (కేజీ) | 1,18,000 |



## ధర్మస్థల కేసులో అనూహ్య మలుపు

- ఫిర్యాదు చేసిన వ్యక్తినే అరెస్ట్ చేసిన సిట్
- సామూహిక అత్యాచారాలు, హత్యలపై ఆరోపణలు
- ఆరోపణలన్నీ కల్పితమని తేల్చిన అధికారులు

వివరాలు 4లో

# మూసీ మురిసేలా..

## రేవంత్ సర్కార్ దూకుడు

**రూ.375 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

ఫస్ట్ ఫేజ్ టెండర్లకు సన్నాహాలు

- స్పెషల్ ఎట్రాక్షన్ కానున్న గేట్ వే ఆఫ్ హైదరాబాద్
- మణిహారం కానున్న గాంధీ సరోవర్

"హైదరాబాద్ అభివృద్ధి కథలో మూసీ నది పునరుద్ధరణ ఒక పెద్ద మలుపు కావొచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అనేక ప్రభుత్వాలు మూసీ అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించినప్పటికీ, అవి అమలు దశలో నిలిచిపోయాయి. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దీనిని కేవలం నది శుద్ధి ప్రాజెక్ట్‌గా కాకుండా, హైదరాబాద్‌కు కొత్త అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే అవకాశంగా చూస్తున్నారు మూసీ తోనే తన మార్క్ చాటుతానని రేవంత్ ఘంటాపథంగా చెబుతున్నారు.. తొలివిడతగా మూసీ ప్రాజెక్టు కు రూ. 375 కోట్లు విడుదల కాగా, దసరా తర్వాత ఫస్ట్ ఫేజ్ పనులు ప్రారంభమయ్యే సూచనలు కనబడుతున్నాయి.

- మహా, హైదరాబాద్





04



## పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

- పీఏసీ సమావేశంలో కాంగ్రెస్ సర్కార్ కీలక నిర్ణయం
- రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో రిజర్వేషన్ల ఫైల్.. పార్టీ పరంగా ఇవ్వాలని నిర్ణయం
- తాజా నిర్ణయంతో వేలది బీసీలకు స్థానిక సంస్థల్లో టికెట్లు ఇవ్వనున్న కాంగ్రెస్ పార్టీ
- బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ
- త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే చాన్స్
- రిజర్వేషన్ల ఖరారు కోసం మంత్రులతో కమిటీ ఏర్పాటు
- ఆగస్టు 28వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని కమిటీకి ఆదేశం

05

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలి

**బీజేపీలోకి రావాలంటే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి రావాలి**

- రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరించాల్సిన అవసరం ఉంది
- రాష్ట్రానికి రావాల్సిన యూరియా తప్పకుండా పంపిస్తాం
- మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో మాకు సంబంధం లేదు
- ఫిరాయింపులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ దొందూ దొందే
- మీడియా చిట్ చాట్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూస్తామని ఆయన అన్నారు. శనివారం ఆయన మీడియా చిట్ చాట్ లో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో దాదాపు 4 లక్షల డబుల్ ఓట్లు ఉన్నాయని, రాష్ట్రంలో ఓటర్ల జాబితాను

మిగతా 4లో

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,306.85 |
| నిఫ్టీ | 24,870.10 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్ల ధరలు**

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.95 | 148.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.95 | 148.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.14 | 157.41 |

## మంత్రి పొంగులేటితో ఈటల భేటీ

**ఇళ్ల పథకం నిబంధనలు సవరించాలని వినతి**

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సమస్యలపై చర్చ

అలాట్‌మెంట్ ప్రక్రియలో లోపాలు, పేదల కేటాయింపులో ఆలస్యంపై డిస్కషన్



**హైదరాబాద్, మహా:** మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తాజాగా రాష్ట్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన ఆయన సమస్యలపై వివరణాత్మక చర్చ నిర్వహించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మల్కాజిగిరి ఎంపీ పరిధిలో పేదలకు కేటాయించాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సమస్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

మిగతా 2లో



పాతూరి నాగభూషణంకు

## కీలక పదవి

- బీజేపీ రాష్ట్ర ప్రోగ్రామ్స్ అండ్ ప్రోటోకాల్ ఇన్ ఛార్జ్ గా నియామకం

వివరాలు 4లో

ఊరూరా బతుకమ్మ పండగగా

## పనుల జాతర

- ఈ కార్యక్రమాలు ప్రజా విజయోత్సవానికి నిదర్శనం
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- మల్లంపల్లి శ్రీనగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



04

## బ్యాట్ కోసమే బాలిక హత్య

- సహస్ర హత్య కేసులో విస్తుపోయే నిజాలు
- క్రికెట్ కిట్ కొనుక్కోవాలనే కోరిక పదిహేనేళ్ల కుర్రాడిని హంతకుడిగా మార్చింది
- ప్రెస్ మీట్ లో పోలీసుల వెల్లడి

వివరాలు 4లో

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

**అధికార పార్టీకి అవకాశమిస్తే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం**

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కీలక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీకి అవకాశం ఇస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్

మిగతా 4లో



# ఓపెన్ ఏఐ

## హైదరాబాద్‌లోనే ప్రారంభించండి

### ఆ సంస్థ సీఈఓ కు కేటీఆర్ స్వాగతం

**హైదరాబాద్, మహా:** టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టిస్తున్న చాట్‌జీపీటీ మాతృసంస్థ 'ఓపెన్ ఏఐ' భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక ప్రతిపాదన చేశారు. భారత్‌లో తమ తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌కు ఆయన బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలో శామ్ ఆల్ట్‌మన్ భారత పర్యటనకు రానున్నారు.

**హైదరాబాద్ సరైన ప్రవేశ ద్వారం..**

ఈ సందర్భంగా, భారత్‌లో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం అద్భుతంగా ఉందని, గత ఏడాదితో పోలిస్తే చాట్‌జీపీటీ వాడకం నాలుగు రెట్లు పెరిగిందని ఆల్ట్‌మన్ ఇటీవల 'ఎక్స్' వేదికగా ప్రశంసించారు. ఆయన పోస్ట్‌కు స్పందించిన కేటీఆర్, హైదరాబాద్‌కు రావాల్సిందిగా ఆల్ట్‌మన్‌ను ఆహ్వానించారు. భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలనుకుంటున్న ఓపెన్ ఏఐ వంటి సంస్థలకు హైదరాబాద్ సరైన ప్రవేశ ద్వారమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ హైదరాబాద్‌లో ఉందని ఆయన నొక్కి చెప్పారు. టీహబ్, వీహబ్, టీవర్క్స్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) వంటి అగ్రశ్రేణి సంస్థలను ప్రస్తావిస్తూ, ఈ వాతావరణం ఓపెన్ ఏఐ కార్యకలాపాలకు ఎంతగానో దోహదపడుతుందని వివరించారు

## మంత్రులకు చంద్రబాబు ర్యాంకులు

### రామానాయుడు ఫస్ట్

**విజయవాడ, మహా :** చంద్రబాబు మంత్రులకు ర్యాంకులు ఇచ్చారు. ఫైల్ క్లియరెన్స్ ఆధారంగా ర్యాంకులు కేటాయించారు. మొదటి స్థానంలో మంత్రి రామానాయుడు నిలవగా, చివరి స్థానాల్లో కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ నిలిచారు. జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన తర్వాత ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రెండో స్థానంలో, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నారు. వీరి తర్వాత నాలుగో స్థానంలో హోం మంత్రి అనిత, ఐదో స్థానంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చోటు దక్కించుకున్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం



(మొదటిపేజీ తరువాయి)

ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని ఆయన అన్నారు.

**సమస్యలు ఎక్కడా ఉండకూడదు..**

జూబ్లీహిల్స్‌లో 6 వేల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రతి బూత్‌కు ఒకరు ఇంఛార్జ్‌గా ఉండాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఎక్కడా ఉండకూడదని ఆదేశించారు. నియోజకవర్గంలోని 7 డివిజన్లలో ఇంఛార్జ్ ఉపాధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్‌లు ప్రభావవంతంగా పనిచేయాలని సూచించారు. డివిజన్లలో కార్యాలయాలు ప్రారంభించాలని అన్నారు. బూత్ వారీగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రభుత్వ పథకాలను పూర్తి చేయాలని ఆదేశించారు.


# మూసీ మురిసేలా.. రేవంత్ సర్కార్ దూకుడు

### రూ.375 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. ఫస్ట్ ఫేజ్ టెండర్లకు సన్నాహాలు

### స్పెషల్ ఎట్రాక్షన్ కానున్న గేట్ వే ఆఫ్ హైదరాబాద్.. మణిహారం కానున్న గాంధీ సరోవర్

**హైదరాబాద్, మహా**

హైదరాబాద్ అభివృద్ధి కథలో మూసీ నది పునరుద్ధరణ ఒక పెద్ద మలుపు కావొచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అనేక ప్రభుత్వాలు మూసీ అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించినప్పటికీ, అవి అమలు దశలో నిలిచిపోయాయి. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దీనిని కేవలం నది శుద్ధి ప్రాజెక్ట్‌గా కాకుండా, హైదరాబాద్‌కు కొత్త అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే అవకాశంగా చూస్తున్నారు మూసీ తోనే తన మార్క్ చాటుతానని రేవంత్ ఘంటాపథంగా చెబుతున్నారు.. తొలివిడతగా మూసీ ప్రాజెక్టు కు రూ. 375 కోట్లు విడుదల కాగా, దసరా తర్వాత ఫస్ట్ ఫేజ్ పనులు ప్రారంభమయ్యే సూచనలు కనబడుతున్నాయి.




**1. "గేట్‌వే ఆఫ్ హైదరాబాద్" – కొత్త ఐడెంటిటీ**

- మూసీ నది తీరాన్ని గేట్ వే ఆఫ్ హైదరాబాద్గా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదన, నగర చరిత్రను, ఆధునికతను మిళితం చేస్తుందన్న భావన వ్యక్తం అవుతోంది.
- నది ఒడ్డున గ్రీన్ కారిడార్‌లు, వాక్‌వేలు, సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు.
- పర్యాటక ఆకర్షణగా ఫుడ్ కోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ జోన్‌లు ఏర్పాటు కానున్నాయి.
- ఇది కేవలం నగర నివాసులకు కాకుండా, హైదరాబాద్‌ను సందర్శించే పర్యాటకులకు ప్రత్యేక అనుభవాన్ని అందిస్తుంది.

**2. గాంధీ సరోవర్ వద్ద "ప్రపంచంలోనే ఎత్తైన టవర్"**

- ప్రతిపాదిత టవర్ నగర భవిష్యత్తుకు కొత్త చిహ్నంగా మారనుంది.
- బాపూఘాట్ సమీపంలో నిర్మించబోయే ఈ టవర్ ప్రపంచంలోనే ఎత్తైనదిగా ఉండబోతోంది.
- పైభాగంలో 360 వ్యూయింగ్ డెక్, అంతర్జాతీయ హోటల్ సౌకర్యాలు, స్కై రెస్టారెంట్ ఉంటాయి.
- ఈ టవర్, బుర్జ్ ఖలీఫా లాంటి గ్లోబల్ ఐకాన్‌గా, హైదరాబాద్‌ను పర్యాటక మ్యాప్‌పై మరింత బలంగా నిలబెడుతుంది.

**3. ఓఆర్ ఆర్ పక్కన "ఎకో థీమ్ పార్క్"**

- హైదరాబాద్ చుట్టూ పెరుగుతున్న కాంక్రీట్ అడవికి విరుద్ధంగా, ప్రకృతి ఆధారిత ఎకో థీమ్ పార్క్ను ప్రతిపాదించారు.
- పచ్చదనం, జీవవైవిధ్యం, పర్యావరణ సంరక్షణ కేంద్రంగా దీనిని తీర్చిదిద్దనున్నారు.
- ట్రెక్కింగ్, సైక్లింగ్, బోటింగ్ వంటి అవుట్‌డోర్ యాక్టివిటీస్ ఏర్పాటు చేస్తారు.
- ఇది కుటుంబ వినోదానికి మాత్రమే కాకుండా, సస్టైనబుల్ టూరిజం మోడల్గా నిలుస్తుంది.

**4. ఎలివేటెడ్ గేట్‌వే – టవర్ & పార్క్ లింక్**

- టవర్ మరియు ఎకో పార్క్‌ను కలిపే ఎలివేటెడ్ గేట్ వే నిర్మాణం ప్రాజెక్ట్ ప్రత్యేకత.
- ఇది రెండు ప్రాంతాలను పర్యాటకంగా అనుసంధానించి, ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది.
- నగరానికి ప్రతిష్ఠాత్మక అర్బన్ ల్యాండ్‌మార్క్గా ఈ గేట్ వే మారుతుంది.

**5. హిమాయత్ సాగర్ – అత్తాపూర్ ఫ్లైఓవర్, ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ**

- ప్రాజెక్ట్ విజయానికి కనెక్టివిటీ కీలకం.
- హిమాయత్ సాగర్ నుండి అత్తాపూర్ వరకు కొత్త ఫ్లైఓవర్ నిర్మిస్తారు.
- దీని ద్వారా గాంధీ సరోవర్ చుట్టూ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పడుతుంది.
- ఆ కారిడార్‌ను నేరుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తారు.
- అంటే, హైదరాబాదు చేరే ప్రతి అంతర్జాతీయ అతిథికి ఈ ప్రాజెక్ట్ "ఫస్ట్ ఇంప్రెషన్" అవుతుంది.

**6. మూసీ శుద్ధి - పునరుద్ధరణ**

- అత్యంత ప్రాధాన్యం గల అంశం మూసీ శుద్ధి.
- పెద్ద ఎత్తున వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేయబడతాయి.
- నది ఒడ్డున ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగింపు, శుభ్రపరిచే చర్యలు.
- చారిత్రక వారసత్వ కట్టడాలను పునరుద్ధరించి, హెరిటేజ్ వాక్‌వేలు అభివృద్ధి.

**7. ఆర్థిక - సామాజిక ప్రభావం**

- పర్యాటక ఆదాయం: బిలియన్ల రూపాయల రెవెన్యూ వచ్చే అవకాశం.
- ఉద్యోగావకాశాలు: నిర్మాణం, టూరిజం, హోటల్స్, సర్వీస్ రంగాలలో వేలాది ఉద్యోగాలు.
- రియల్ ఎస్టేట్: నది చుట్టూ భూముల విలువలు పెరుగుతాయి.
- అంతర్జాతీయ గుర్తింపు: హైదరాబాద్ సింగపూర్, దుబాయ్, బాంకాక్ లాంటి గ్లోబల్ డెస్టినేషన్లలో ఒకటిగా నిలుస్తుంది.

**గోల్డెన్ ప్రాజెక్టు**

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన మూసీ సమగ్ర ప్రక్షాళన కేవలం మౌలిక వసతుల ప్రాజెక్ట్ కాదు. ఇది నగర భవిష్యత్తు విజన్, హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలబెట్టే వ్యూహం. గతంలో మూసీ శుద్ధి ప్రయత్నాలు విఫలమైనా, ఈసారి ప్రభుత్వం ప్లానింగ్, ఫైనాన్సింగ్, అమలులో పారదర్శకత, అంతర్జాతీయ భాగస్వామ్యాలు సాధిస్తే, ఇది హైదరాబాద్ చరిత్రలో గోల్డెన్ ప్రాజెక్ట్గా నిలుస్తుందన్న విశ్లేషణలు ఉన్నాయి.

# తగ్గేదే లేదు


## మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

### నీటి వనరుల పరిరక్షణలో రోల్ మోడల్ గా తెలంగాణ

### ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది

### ఐటీపీఐ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మహా :** 'సాధారణంగా ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరు కావాలనే అడ్డుపడుతుంటారు. మూసీ విషయంలోనూ ఇదే జరుగుతోంది. భావి తరాల కోసం ప్రక్షాళన చేసి తీరుతాం. వెనక్కి తగ్గేదే లేదు. నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్ గా నిలుపుతాం' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా (ఐటీపీఐ) తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్ లోని హోటల్ లో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టువర్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమన్నారు. ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది అని నొక్కి చెప్పారు. మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ - న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీపీఐ ప్రెసిడెంట్ ఎన్ కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కోఆర్డినేటర్ (టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీపీఐ - తెలంగాణ రీజినల్ ఛాప్టర్ ఛైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఊరూరా బతుకమ్మ పండగగా పనుల జాతర

## ఈ కార్యక్రమాలు ప్రజా విజయోత్సవానికి నిదర్శనం

### పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

### మల్లంపల్లి శ్రీనగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



**ములుగు, మహా:** రెండవ రోజు 'పనుల జాతర'లో భాగంగా ములుగు జిల్లా మల్లంపల్లి శ్రీనగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత జేడీ మల్లెంపల్లి మండలంలోని ఎం.డి. గౌస్ పల్లెలో నిర్మాణం పూర్తి చేసుకున్న కల్వర్టును మంత్రి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, సుస్థిరత లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'పనుల జాతర' మొదలైంది. ఉపాధి అవకాశాలను పెంచుతూ, మౌలిక సదుపాయాలను విస్తరించే దిశగా 'పనుల జాతర' ముందుకు సాగుతోంది. మొదటి రోజు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.205 కోట్లతో మొత్తం 13,552 పనులు ప్రారంభించబడగా, రూ.1994 కోట్ల నిధులతో 88,037 అభివృద్ధి పనులకు అనుమతి పత్రాలు జారీ అయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలో 1,01,589 పనులు రూ.2199 కోట్ల నిధులతో ప్రారంభమవడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది.

**ప్రజా విజయోత్సవానికి నిదర్శనం..**

ఇప్పటివరకు 65 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు 'పనుల జాతర'లో భాగస్వామ్యం కావడం విశేషం. ప్రజల భాగస్వామ్యంతో ఊరూరా బతుకమ్మ పండగగా 'పనుల జాతర' మారింది. 'పనుల జాతర'ను మంచి సమన్వయంతో సక్సెస్ చేసిన పంచాయతీరాజ్ కమిషనర్ నుండి పంచాయతీ కార్యదర్శి, కారోబార్ వరకు అందరికీ సీతక్క హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి ప్రతి కుటుంబానికి వేతనంతో కూడిన పనిని కల్పించడం ద్వారా మౌలిక వసతుల కల్పన, ఉత్పాదకత పెంపు, సుస్థిరమైన ఆస్తుల సృష్టి లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు ప్రజా విజయోత్సవానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, సహచర మంత్రులు పాల్గొనడం ఎంతో సంతోషకరమని మంత్రి తెలిపారు.

# బ్యాట్ కోసమే బాలిక హత్య

## సహస్ర హత్య కేసులో విస్తుపోయే నిజాలు

### క్రికెట్ కిట్ కొనుక్కోవాలనే కోరిక పదిహేనేళ్ల కుర్రాడిని హంతకుడిగా మార్చింది

### ప్రెస్ మీట్ లో పోలీసుల వెల్లడి

**హైదరాబాద్, మహా :** కూకట్‌పల్లి సహస్ర హత్య కేసులో మిస్టరీ వీడింది. అభం శుభం ఎరగని పదకొండేళ్ల చిన్నారిని అతి కిరాతకంగా చంపింది పక్కింటి కుర్రాడేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. సహస్ర ఇంట్లో దొంగతనం, మర్డర్ కోసం బాలుడు రెండ్రోజులు ముందుగానే ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. యూట్యూబ్‌లో చూసే క్రైమ్ సీన్స్, సినిమాల స్ఫూర్తితో స్కెచ్ వేసుకుని ఆ ప్రకారమే సహస్రను హత్య చేశాడని బాలానగర్ డీసీపీ ప్రకటించారు. క్రికెట్ కిట్ కోసమే బాలుడు ఈ హత్యకు పాల్పడటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సహస్ర హత్య అనంతరం అనుమానంతో బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వయసు 15 ఏళ్లే అయినప్పటికీ విచారణలో మాత్రం అతడు క్రిమినల్ ఇంటెలిజెంట్‌లా వ్యవహరించి పోలీసులను తప్పుదోవ పట్టించాడని బాలానగర్ డీసీపీ వెల్లడించాడు. ఆధారాల్లేకుండా హత్యచేసి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన బాలుడు చివరికి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సమాచారంలో అడ్డంగా దొరికిపోయాడు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను విచారించగా హత్య జరిగిన రోజున ఓ బాలుడు గోడదూకి అపార్ట్‌మెంట్‌లోకి రావడాన్ని గమనించినట్లు వాంగ్మూలం ఇచ్చాడు. ఈ దిశలో పోలీసులు దర్యాప్తు చేయగా బాలుడే హంతకుడనే స్పష్టమైంది. అనంతరం బాలుడు సహస్రను హత్య చేసినట్లు అంగీకరించాడు. క్రికెట్ బ్యాట్ కొనుక్కోవాలని బాలిక ఇంటికి చోరీ కోసం వెళ్లానని.. తర్వాత కత్తితో ఆమెను హత్య చేసి ఇంటికొచ్చి కత్తిని శుభ్రంగా కడిగానని ఒప్పుకున్నాడు. టీ షర్ట్‌కు రక్తపు మరకలు అంటడంతో వాషింగ్ మెషీన్లో వేశానని చెప్పాడు. క్రైమ్ మూవీస్ చూసే అలవాటు ఉందని, దొంగతనం చేయడం, తప్పించుకోవడంపై ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశానని వెల్లడించాడు. చోరీకి రెండు రోజుల ముందే బాలుడు ప్లాన్ వేసుకున్నాడు. అలాగే, చోరీలు, హత్యల గురించి బాలుడు రాసుకున్న పుస్తకాన్ని, హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. సహస్ర తండ్రి మీడియాతో మాట్లాడుతూ, తన కూతుర్ని చంపిన బాలుడికి ఉరి శిక్ష విధించాలని విజ్ఞప్తి చేశాడు. అతడికి ఏ మాత్రం భయం, పశ్చాత్తాపం లేవని.. పెద్దవాళ్ల తరహాలో హత్యకు పాల్పడినందుకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు. కాగా, నిందితుడి తల్లి తల్లి సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా.. తండ్రి ఏ పని చేయడం లేదు. అతడికి ఇద్దరు అక్కలు ఉన్నట్లు సమాచారం.



# ధర్మస్థల కేసులో అనూహ్య మలుపు

- ఫిర్యాదు చేసిన వ్యక్తినే అరెస్ట్ చేసిన సిట్
- సామూహిక అత్యాచారాలు, హత్యలపై ఆరోపణలు
- ఆరోపణలన్నీ కల్పితమని తేల్చిన అధికారులు

**మహా:** పుణ్యక్షేత్రం ధర్మస్థలలో సామూహిక అత్యాచారాలు, హత్యలు జరిగాయంటూ సంచలన ఆరోపణలు చేసిన ఫిర్యాదుదారుడిని ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుంది. ఇప్పటివరకూ ఈ కేసులో బాధితుల పక్షాన మాట్లాడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అతడి ఆరోప లన్నీ కల్పితమని, అవాస్తవమని తేలడంతో ఈ చర్య తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. గత కొంతకాలంగా, తన ముఖం బయటపడకుండా ముసుగు ధరించి ఒక వ్యక్తి ధర్మస్థలలో ఘోరాలు జరిగాయంటూ ఆరోపణలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం అతడిని విచారణకు పిలిచింది. గంటల తరబడి సాగిన విచారణలో అతడు చెప్పిన విషయాలకు, వాస్తవాలకు పొంతన లేదని అధికారులు గుర్తించారు. తాను చేసిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించలేకపోవడంతో పాటు, చెప్పినవన్నీ కట్టుకథలని విచారణలో తేలింది. దీంతో, తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారన్న కారణంతో అతడిని అదుపులోకి తీసుకున్నట్టు సిట్ అధికారులు తెలిపారు. ఈ అరెస్ట్‌తో ధర్మస్థల కేసు అనూహ్య మలుపు తీసుకుంది.

# మంత్రి పొంగులేటితో ఈటల భేటీ

## ఇళ్ల పథకం నిబంధనలు సవరించాలని వినతి

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సమస్యలపై చర్చ

### అలాట్‌మెంట్ ప్రక్రియలో లోపాలు, పేదల కేటాయింపులో ఆలస్యంపై డిస్కషన్



(మొదటిపేజీ తరువాయి)

గతంలో తప్పిపోయిన పేదల జాబితాను మంత్రి పొంగులేటికి అందించినప్పటికీ, ఇప్పటివరకు కేటాయింపులు సక్రమంగా జరిగేవి లేవని, అలాట్మెంట్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో భూములు దొంగల పుటకు చేరుతున్నాయని చెప్పారు. ఐదు లక్షల రూపాయలతో పేదవాడు ఇల్లు కట్టే పరిస్థితి కుదరదని, నిజానికి కనీసం 12 లక్షలుగా ఖర్చు ఉంటుందని ఈటల రాజేందర్ వివరించారు.

**కేంద్రంపై మాత్రమే ఒత్తిడి చూపడం సరైంది కాదు..**

జవహర్ నగర్‌లో ఉన్న భూములు ప్రభుత్వానికి సంబంధం లేకుండా, మాజీ డిఫెన్స్ అధికారులకు కేటాయించబడినందుకు విమర్శలు వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఉన్న ఇండ్లను కూల్చడం కరెక్ట్ కాదని, 60-80 గజాల భూముల్లో ఇళ్ళు నిర్మించినవారు కటిక పేదలే కాక ధనవంతులైనవారే కాదని అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబును కలిసే అవకాశం లేకపోవడంతో డీఆర్సీ సమావేశం ఏర్పాటు చేయలేకపోవడంపై బాధ వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నేరుగా సహకరించకపోవడం, అవసరమైతే కేంద్రంతో చర్చలు చేస్తామనే వైపు ఆయన వెల్లడించారు. కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారాల్లో నియమాలు, బాధ్యతలపై కూడా ఈటల రాజేందర్ స్పష్టత ఇచ్చారు. రాష్ట్ర మంత్రులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గూర్చి, కేంద్రంపై మాత్రమే ఒత్తిడి చూపడం సరైంది కాదని పేర్కొన్నారు. అంతేకాక, ఈటల రాజేందర్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి కోసం పార్టీలు ఓట్ల కోసం అభ్యర్థన చేయాలని సూచించారు.

# పాతూరి నాగభూషణంకు కీలక పదవి

## బీజేపీ రాష్ట్ర ప్రోగ్రామ్స్ అండ్ ప్రోటోకాల్ ఇన్ ఛార్జ్ గా నియామకం



**విజయవాడ, మహా:** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర పదాధికారుల కమిటీని ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఇందులో ప్రోగ్రామ్స్ అండ్ ప్రోటోకాల్ ఇన్ ఛార్జ్ గా బీజేపీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం నియమితులయ్యారు. గతంలో రెండు సార్లు జిల్లా పరిషత్ చైర్మన్‌గా వ్యవహరించిన నాగభూషణం విశేష అనుభవం దృష్ట్యా అధిష్టానం ఆయనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించింది. ఇంతకుముందు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర మీడియా ఇన్ చార్జిగా పాతూరి పనిచేశారు. బీజేపీలో క్రమశిక్షణ కలిగిన నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా పాతూరి నాగభూషణం మాట్లాడుతూ.. నాకు ఈ పదవి రావడం పట్ల సంతోషంగా ఉంది.. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కి ధన్యవాదాలు.. వారి నాయకత్వంలో పార్టీని ముందుకు నడిపించే బాధ్యతల్లో నా శక్తిమేర పనిచేస్తాను.. నా మీద ఉంచిన ఈ గురుతర బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తాను.. అలాగే కమిటీలో వివిధ విభాగాలలో నియమితులైన ప్రతిఒక్కరికి అభినందనలు ' అని పాతూరి నాగభూషణం వెల్లడించారు.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

సమగ్రంగా సవరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తాము ఓట్ల చోరీకి పాల్పడితే లోక్‌సభలో తమ పార్టీ సీట్లు ఎందుకు తగ్గాయని ఆయన ప్రశ్నించారు.

**తెలంగాణ మంత్రి ఫోన్ చేశారు..**

రాష్ట్రానికి యూరియా సరఫరా అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనతో ఫోన్‌లో మాట్లాడారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరారని, రాష్ట్రానికి రావాల్సిన వాటాను తప్పకుండా పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సాంకేతిక కారణాల వల్ల రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిందని ఆయన వివరించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పందిస్తూ, ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొందూ దొందేనని విమర్శించారు. బీజేపీలోకి ఎవరైనా రావాలనుకుంటే, తమ పదవులకు రాజీనామా చేసి రావాలని ఆయన స్పష్టం చేశారు. మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని మరోసారి తేల్చి చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై మాట్లాడుతూ.. మెట్రో ప్రస్తుతం నష్టాల్లో నడుస్తోందని, దీంతో కొత్త లైన్ల నిర్మాణానికి ఎల్ అండ్ డీ సంస్థ సుముఖంగా లేదని అన్నారు. అయితే, మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. బీహార్‌లో బీజేపీ తప్పకుండా అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ANN తెలుగు
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ | 24-08-2025

WWW.MAHAADAILY.COM

# పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

## పీఏసీ సమావేశంలో కాంగ్రెస్ సర్కార్ కీలక నిర్ణయం

రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో రిజర్వేషన్ల ఫైల్.. పార్టీ పరంగా ఇవ్వాలని నిర్ణయం
తాజా నిర్ణయంతో వేలాది బీసీలకు స్థానిక సంస్థల్లో టికెట్లు ఇవ్వనున్న కాంగ్రెస్ పార్టీ
బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ
త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే చాన్స్
రిజర్వేషన్ల ఖరారు కోసం మంత్రులతో కమిటీ ఏర్పాటు
ఆగస్టు 28వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని కమిటీకి ఆదేశం



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై అధికార కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలన్న రాష్ట్ర హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్, టీపీసీసీ అడ్వైజరీ కమిటీ సమావేశం అయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప రాష్ట్రపతి ఎన్నికలు సహా పలు అంశాలపై నేతలు చర్చించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అందు కోసం బిల్లు ఆమోదించినా రాష్ట్రపతి ఆమోదం పొందలేదు. దాంతో చట్టపరంగా ఇవ్వడం సాధ్యం కావడం లేదు. సెప్టెంబర్ నెలాఖరు లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జూలై నెలాఖరుకే రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంది. కానీ చేయలేదు. ఇప్పుడు రిజర్వేషన్ల వివాదం పరిష్కారం కాదు కాబట్టి పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తే హామీ కాస్త అయినా నెరవేర్చినట్లు అవుతుందని భావిస్తున్నారు. ఇతర పార్టీలు కూడా అలాగే ఇవ్వాలని డిమాండ్ చేసే అవకాశం ఉంటుంది.

### కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీలకు ఒక్క శాతం..

బీసీ లకు విద్యా,ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు మంత్రి వర్గం లో ఆమోదించి అసెంబ్లీ లో బిల్ పాస్ చేసుకున్నామని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు విడిగా మరో బిల్ తీసుకొచ్చామని పీఏసీ సమావేశంలో రేవంత్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారని.. ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చామన్నారు. కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్సు తెచ్చాం..దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారని అన్నారు. కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీలకు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా రాదు .. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశం పైన సుప్రీమ్ కోర్టు లో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని రేవంత్ తెలిపారు. అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుంది.. విడిగా సుప్రీంకోర్టుకు వెళ్తే కేసు లిస్ట్ కావడానికి బాగా సమయం పడుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి హామీ ఇచ్చి.. అలా అయితేనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ప్రచారం చేసి.. ఇప్పుడు పార్టీపరమైన రిజర్వేషన్లు అని అనడం ఏమిటని విపక్షాలు విరుచుకుపడే అవకాశం ఉంది. ఇతర పార్టీలు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాయో లేదో కానీ.. అధికారికంగా రిజర్వేషన్లు లేకుండా.. స్థానిక ఎన్నికల్లో 42 శాతం అనే లెక్కలు వేయడం చాలా కష్టమంటున్నారు.

### రిజర్వేషన్ల ఖరారు కోసం మంత్రులతో కమిటీ..

స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లోకల్ బాడీ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు కోసం మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క ఈ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. న్యాయ నిపుణులతో చర్చించి 2025, ఆగస్టు 28వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని మంత్రుల కమిటీని ఆదేశించింది ప్రభుత్వం. మంత్రుల కమిటీ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలపై ముందుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. 2025, ఆగస్టు 29న తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించి మంత్రుల కమిటీ సమర్పించిన నివేదికపై నిర్ణయం తీసుకోనున్నారు.

# అట్టహాసంగా జాతీయ క్రీడా ఉత్సవాలు..

## దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా నిర్వహించబోతున్నాం

మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి
తొమ్మిది రోజుల పాటు జరిగే జాతీయ క్రీడా ఉత్సవాలు ప్రారంభం



**హైదరాబాద్, మహా:** పసిప్రాయం నుండి పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు జరిగే జాతీయ క్రీడా ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చిన్ననాటి నుండే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం, వారిని మైదానాల వైపు ప్రోత్సహించడం, కుటుంబాలకు మాత్రమే కాకుండా, దేశానికి సమాజానికి ఎంతో శ్రేయస్కరమని ఆయన అన్నారు.

**దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత..**

మొక్కై వంగనిది మానై వంగదు అనే సామెత మాదిరిగా పసిప్రాయం నుండే క్రీడల పట్ల శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడమే కాకుండా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దబడతారని మంత్రి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా జాతీయ క్రీడా ఉత్సవాలు నిర్వహించబోతున్నామని, కేవలం హైదరాబాద్ నగరానికే కాకుండా జిల్లా కేంద్రాల్లో, వివిధ విద్యాసంస్థల్లో, ఈ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, అనిత, పీఆర్ఓ కాలేరు సురేష్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు, ఫ్యూచర్ ఒలింపియన్ నిర్వాహకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రంప్‌కు షాక్!

## భారీగా తగ్గిన అమెరికా వలసలు

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ .. సంచలన నిర్ణయాలతో ప్రపంచ దేశాలపైనా ప్రభావం చూపిస్తున్నారు.

**వలసదారుల విషయంలో కఠిన ఆంక్షలు..**

మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) నినాదంతో.. నిర్ణయాలు, విధానాలు, ఉత్తర్వులు వెలువరిస్తున్న ట్రంప్.. అమెరికన్లకే పెద్దపీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికాలో ఉన్న కంపెనీలు అమెరికన్లకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారు. అదే సమయంలో విదేశాల నుంచి అమెరికాలోకి వచ్చే వలసదారుల విషయంలో కఠిన ఆంక్షలు విధిస్తున్నారు. ఇక వీసా గడువు ముగిసిన వారు, అక్రమ మార్గాల్లో అమెరికాలోకి చొరబడినవారు, ఇతర అక్రమ వలసదారులను గుర్తించి.. వారి స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలాగా కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఒకప్పుడు అమెరికా అంటేనే ఎగిరి గంతేసి వెళ్లే ప్రపంచ దేశాల ప్రజలు.. ఇప్పుడు అమెరికా పేరు చెబితే జంకుతున్నారు. ఈ క్రమంలోనే అమెరికాలోని వలసదారులపై ట్రంప్ తీసుకున్న కఠిన చర్యల కారణంగా.. తాజాగా ఆ దేశంలోకి వలసలు గణనీయంగా తగ్గాయని ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన ఒక రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. ఈ ఏడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. సంచలన నిర్ణయాలు వెలువరించారు. ఈ కారణంగానే జనవరి నుంచి జూన్ మధ్య గత 6 నెలల్లో ఏకంగా 15 లక్షల మంది వలసదారులు తగ్గినట్లు ఆ నివేదిక వెల్లడించింది. ఈ క్రమంలోనే మొత్తం వలసదారుల సంఖ్య 53.3 మిలియన్ల నుంచి 51.9 మిలియన్లకు పడిపోయినట్లు తెలిపింది. 1960ల తర్వాత అమెరికాలో ఇది తొలిసారి సంభవించిన పరిణామమని ప్యూ రీసెర్చ్ నివేదిక తేల్చి చెప్పింది. అయితే ఇలా జరగడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు కీలకమైన శ్రామికశక్తి తగ్గిపోతోందని నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పోస్టల్ సేవలను నిలిపివేత..**

అమెరికాకు అన్ని రకాల పోస్టల్ సేవలను భారత్ నిలిపివేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారతీయ వస్తువులపై 50 శాతం పన్ను విధించిన తర్వాత భారత తపాలా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికాకు పంపే అన్ని రకాల పోస్టల్ ఆర్టికల్స్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు భారత తపాలా శాఖ శనివారం తెలిపింది.

# యూరియాపై ఆందోళన వద్దు

## రాష్ట్రానికి సరఫరా పెంచేందుకు అన్ని రకాల చర్యలు

ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి పునరుద్ధరణపై మార్గనిర్దేశం
సచివాలయంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు సమీక్ష

**హైదరాబాద్, మహా :** రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) యాజమాన్యం, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సీజన్ లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పని చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్ఎఫ్సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్ ను ప్రశ్నించారు. మిమ్మల్ని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదని, రాష్ట్రాభివృద్ధిలో మాతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్ ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దన్నారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్ఎఫ్సీఎల్ మాతృ సంస్థ ఎన్ఎఫ్ఎల్ కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతి రోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో మీకేమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్ఎఫ్సీఎల్ రామగుండం యూనిట్ హెడ్, జీఎం రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతపై బీజేపీ, బీఆర్ఎస్‌లు డ్రామా

- యూరియా కోసం నాలుగుసార్లు కేంద్ర మంత్రులు కలిశా
- రాహుల్ గాంధీఓట్ చోరీ పాదయాత్రకు 26న హాజరవుతా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి యూరియా కొరతపై బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి డ్రామాలాడుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. యూరియా ఇచ్చే పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని కేటీఆర్ అనడంలోనే వాళ్ల తీరు అర్థమవుతోందని విమర్శించారు. యూరియా కోసం నాలుగుసార్లు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అనుప్రియా పటేల్‌ను కలిశానని సీఎం రేవంత్ తెలిపారు. యూరియా పంపిణీ అంశానికి సంబంధించి క్షేత్రస్థాయిలో మానిటరింగ్‌ను పెంచాలని రేవంత్ డిమాండ్ చేశారు. శనివారం గాంధీ భవన్‌లో మూడు గంటల పాటు జరిగిన పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడారు. 'ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి ప్రకటించినందుకు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ పరిరక్షణ కోసం, పౌర హక్కులను కాపాడటం కోసం పని చేశారు. రాహుల్ గాంధీ, పార్టీ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో కులగణన చేపట్టాం.

**రాహుల్ గాంధీ మాట నిలబడాలి..**

బీసీలకు విద్యా, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు మంత్రివర్గంలో ఆమోదించి అసెంబ్లీలో బిల్ పాస్ చేసుకున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు విడిగా మరో బిల్ తీసుకొచ్చాం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారు. ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చాం. కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్సు తెచ్చాం.. దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారు. బీసీలకు మేలు జరగాల్సిందే. రాహుల్ గాంధీ మాట నిలబడాలి. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశం పైన సుప్రీం కోర్టు లో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించాం. బీహార్ లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ఓట్ చోరీ పాదయాత్రకు ఈ నెల 26వ తేదీన హాజరవుతా' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# దేశంలో రిచ్చెస్ట్ సీఎంగా చంద్రబాబు

## రూ.332 కోట్ల ఆస్తులతో రెండో ప్లేస్ లో అరుణాచల్ ప్రదేశ్ సీఎం

రూ.30 కోట్లతో ఏడో స్థానంలో రేవంత్.. చివరి స్థానంలో రూ. 33 లక్షలతో దీదీ
దేశంలోని సీఎంల ఆస్తులపై ఏడీఆర్ కీలక విషయాలు

**హైదరాబాద్, మహా:** దేశంలోని ముఖ్యమంత్రుల ఆర్థిక స్థితిపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదిక దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా నిలిచారు. ఆయన ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్న ఆస్తుల విలువ రూ.931 కోట్లకు పైగా ఉందని ఏడీఆర్ వెల్లడించింది. ఈ సంపదలో ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు కూడా చేరి ఉన్నాయి. అదే సమయంలో, ఆయనకు రూ.10 కోట్ల అప్పులు ఉన్నట్లు కూడా నివేదికలో పేర్కొనబడింది. ఈ గణాంకాలు చంద్రబాబు నాయుడు ఆర్థిక బలం ఎంత ఎక్కువగా ఉందో స్పష్టం చేస్తున్నాయి. రెండవ స్థానంలో అరుణాచల్ ప్రదేశ్ సీఎం పేమా ఖండూ నిలిచారు. పేమా ఖండూ మొత్తం ఆస్తి విలువ రూ. 332 కోట్లు.ఇక తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.30 కోట్ల ఆస్తులతో ఏడో స్థానంలో నిలిచారు.

**దీదీ ఆస్తులు రూ. 15 లక్షలు మాత్రమే..**

వీరిద్దరు మాత్రమే దేశంలోని 31 ముఖ్యమంత్రుల్లో బిలియనీర్లు అని నివేదిక వెల్లడించింది. తక్కువ ఆస్తులు కలిగిన ముఖ్యమంత్రిగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జాబితాలో చివరి స్థానంలో నిలిచారు. దీదీ ఆస్తులు రూ. 15 లక్షలు మాత్రమే అని 2021 భోవానిపూర్ ఉపఎన్నికల అఫిడవిట్ పేర్కొన్నారు. ఒక్కో ముఖ్యమంత్రి సగటు సంపద రూ.52.59 కోట్లు అని నివేదిక చెబుతోంది. 20232024లో భారతదేశ తలసరి నికర జాతీయ ఆదాయం సుమారు రూ. 1,85,854 కాగా, ముఖ్యమంత్రి సగటు ఆదాయం రూ. 13,64,310, ఇది భారతదేశ సగటు తలసరి ఆదాయం కంటే 7.3 రెట్లు ఎక్కువ. ఏడీఆర్ సమన్వయకర్త ఉజ్జయిని హలీమ్ మాట్లాడుతూ.. దేశంలో పెరుగుతున్న ఎన్నికల ఖర్చులు తక్కువ ఆదాయం ఉన్న అభ్యర్థులకు పోటీ చేయడం మరింత కష్టతరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో డబ్బు కీలక పాత్ర పోషిస్తుందనీ, ఎన్నికల ఖర్చులు పెరుగుతున్నాయని, అభ్యర్థి పోటీ చేయడం కష్టం అవుతోందని వ్యాఖ్యానించారు. ఇలా దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తులు, వారి ఎన్నికల ఖర్చులను సమగ్రంగా విశ్లేషించినట్టు తెలిపారు.



# యూరియా కొరతపై బీజేపీ, కాంగ్రెస్ హైడ్రామాలు

- రైతుల జీవితాలతో రెండు పార్టీల చెలగాటం
- విభిన్న ప్రకటనలతో చేతులు దులుపుకునే యత్నం
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- మోసపూరిత వైఖరి మాని, యూరియా కొరత తీర్చాలని డిమాండ్

**హైదరాబాద్, మహా :** రైతు ప్రయోజనాలు పక్కన బెట్టి, ఎరువుల కొరత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రామాకు తెరతీసాయని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. యూరియా కొరత తీర్చడంపై దృష్టి పెట్టడం మానేసి, తమ తప్పు లేదన్నట్లు చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. 'దేశంలో యూరియా కొరత లేదని ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కేంద్రం ఇవ్వడం లేదంటున్నారు. వీరద్దరిలో ఎవరు నిజం? ఎవరు అబద్ధం? ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమా? లేక రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమా' అని హరీశ్ రావు నిలదీసారు. దేశ వ్యాప్తంగా 143 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే, అందుబాటులో 183 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయని, ఇప్పటికే 155 లక్షల మెట్రిక్ టన్నులు విక్రయించామని కేంద్రం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసారు. ఇదే విధంగా, డీఏపీ 45 లక్షల టన్నుల అవసరానికి 49 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయని, ఎన్ పీకే 58 లక్షల టన్నుల అవసరానికి 97 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయని కేంద్రం తెలిపిందని గుర్తు చేసారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాలు నిజమైతే, రైతులకు ఎరువులు అందించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వమే తప్పిదానికి బాధ్యత వహించాలన్నారు. దేశం మొత్తంలో ఎరువుల కొరత లేకపోయినా, తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు పడుతుండటం రేవంత్ సర్కారు నిర్లక్ష్యాన్ని చూపుతుందని విమర్శించారు. రైతులను మోసం చేయడం మానేసి, తక్షణమే అవసరమైన ఎరువులు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# అర్చకులు, ఈవోలకు పదోన్నతులు

## ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం

అర్చకులు మెడికల్, రిటైర్మెంట్ బెనిఫిట్స్
మంత్రి సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన జ్యోతిచంద్ర శర్మ

**హైదరాబాద్, మహా:** దేవాదాయ శాఖలో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆలయాల అర్చకులు, ఈవోలకు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో దేవాదాయ శాఖ పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు శనివారం సచివాలయంలో మంత్రి సురేఖ పదోన్నతి పొందిన అర్చకులు, ఈవోలకు ఆర్డర్ కాపీలను అందజేశారు. వివిధ దేవాలయాలలో పని చేస్తున్న అర్చక, సిబ్బందికి జీవో ఎంఎస్.నం.261 ప్రకారం14 వేదపరాయణం చేసేవారికి గ్రేడ్III నుంచి II, గ్రేడ్II నుంచి I, 2పోస్టులు మొత్తం 16 మంది అభ్యర్థులను ఎంపికచేశారు. వీరికి మంత్రి ఉత్తర్వులు అందజేశారు. ఈఓ గ్రేడ్III నుంచి ఈఓ గ్రేడ్II ఇద్దరు, మోఫిసిల్ సీనియర్ అసిస్టెంట్ నుంచి ఈఓ గ్రేడ్II ఒకటి, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ నుంచి కన్వర్షన్ ఆఫ్ సర్వీసెస్ కింద ముగ్గురు అభ్యర్థులకు ఈఓ గ్రేడ్III గా మంత్రి సురేఖ ఉత్తర్వులను అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ క్యాటగిరిలో పదోన్నతులు పొందాల్సిన ఫీడర్ క్యాటగిరీస్ అయిన ఈఓ గ్రేడ్I, మోఫిసిల్ సూపరిండెంట్స్, ప్రముఖ దేవాలయాల్లోని ఏఈఓల సీనియారిటీలు వివిధ కారణాలతో ఆగిపోగా.. ప్రభుత్వం సమీక్షించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. డిపార్ట్‌మెంటల్ పదోన్నతులను త్వరిత గతిన పరిష్కరించడానికి డిపార్టుమెంటు సిబ్బందితో పాటు... జీఏడీలో పనిచేసిన అనుభవం ఉన్న విశ్రాంత ఉద్యోగులతో కమిటీ వేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంటు డైరెక్టర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఏడీసీ శ్రీనివాస రావు, జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, డిప్యూటీ కమిషనర్ వినోద్ కుమార్, కృష్ణప్రసాద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



అర్చకులు మెడికల్, రిటైర్మెంట్ బెనిఫిట్స్..

దేవాదాయ శాఖలోని ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పదవీ వీరమణ చేసిన అర్చక, ఇతర ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.4.00 లక్షల నుంచి రూ.8.00 లక్షలకు పెంచడానికి, హోసింగ్ లోన్లో రూ.10 లక్షల వరకు బ్యాంకు వడ్డీ, ఇతర సౌకర్యాలు అర్చక సంక్షేమ నిధి ద్వారా లబ్ధి చేకూర్చేందుకు మంత్రి సురేఖ ప్రత్యేకంగా కృషి చేశారు. దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు, ఇతర సిబ్బంది నలుగురికి మెడికల్ రీయంబర్స్మెంటు ప్రొసిడింగ్స్ అందజేశారు.

**10 ఆలయాల అభివృద్ధికి చర్యలు..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం బంగారు గోపురం మొదలు కొని దేవాదాయశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మంత్రి సురేఖ ఎండోమెంట్ డైరెక్టర్ వెంకటరావు ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 10 పెద్ద దేవాలయాల అధివృద్ధి కోసం భక్తులకు మెరుగైన వసతుల కల్పించేందుకు మాస్టర్ ప్లాన్కు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

### అధికారిక లాంఛనాలతో సురవరం అంతిమయాత్ర

రేవంత్ రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, మహా :** సీపీఐ సీనియర్ నేత, ఆ పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అంతిమయాత్రను అధికార లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సురవరం శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలి కేర్ ఆసుపత్రి నుంచి సురవరం భౌతికకాయాన్ని పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు తరలిస్తారు. అక్కడ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. మధ్యాహ్నం 3 గంటలకు మఖ్దూం భవన్ నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమయాత్ర కొనసాగుతుంది. ఊరేగింపు ప్రారంభానికి ముందు ప్రభుత్వ లాంఛనాలతో పోలీసులు ఆయన పార్థివ దేహానికి గౌరవ వందనం సమర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం సురవరం పార్థివ దేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు పలు పార్టీల నాయకులు హాజరయ్యే అవకాశం ఉంది.

# కర్నాటక బెట్టింగ్ యాప్స్ కేసు

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్..



**బెంగళూరు, మహా :** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న ఆరోపణలతో కర్ణాటక ఎమ్మెల్యే కేసీ వీరేంద్రను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. శనివారం సిక్కిమ్‌లోని గ్యాంగ్‌టక్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులను కూడా ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న ఆరోపణలతో కేసీ వీరేంద్రకు చెందిన 60 ప్రదేశాల్లో యాంటీ మనీ ల్యాండరింగ్ ఏజెన్సీ శుక్రవారం సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో పెద్ద మొత్తంలో నగదు, బంగారం, ఇతర వస్తువులను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏకంగా 12 కోట్ల నగదు దొరికింది. ఇందులో కోటి రూపాయలు విలువ చేసే ఫారెన్ కరెన్సీ కూడా ఉంది. నగదుతో పాటు 6 కోట్ల విలువ చేసే బంగారు నగలు, 10 కేజీల వెండి నగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నాలుగు వాహనాలను కూడా సీజ్ చేశారు. ఎమ్మెల్యేకు చెందిన 17 బ్యాంకు అకౌంట్లను, రెండు బ్యాంకు లాకర్లను సెంట్రల్ ఏజెన్సీ ఫ్రీజ్ చేసింది.

కేసీ వీరేంద్రతో పాటు ఆయన సోదరుడు కేసీ నాగరాజు, అతడి కొడుకు పృథ్వీ ఎన్ రాజ్‌కు చెందిన పలు ఆస్తుల తాలూకా డాక్యుమెంట్స్‌ను ఈడీ సీజ్ చేసింది. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కేసీ తిప్పేస్వామీ, పృథ్వీ ఎన్ రాజ్‌లు దుబాయ్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్స్ నిర్వహిస్తున్నారు. ఇక, ఎమ్మెల్యేను అరెస్ట్ చేసిన తర్వాత అధికారులు ఆయన్ని గ్యాంగ్‌టక్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అరెస్టు చేసిన వారిని తిరిగి కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరింత సమాచారం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# నింగికి ఎగిసిన ఎర్ర సూరీడు...

## కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

### భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్లలో ఘనంగా నివాళులు

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే రామస్వామి

**చేవెళ్ల, మహా:** భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల మండల సమితి ఆధ్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి ఘనంగా పూలమాలలతో నివాళులు అర్పించడం జరిగింది. సిపిఐ అగ్ర నాయకులు, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి(83) శుక్రవారం రాత్రి 10 గంటలకు తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే రామస్వామి మాట్లాడుతూ... సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ముగింపు జరుగుతున్న సమయములో రాత్రి 10గం. లకు కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురవరం సుధాకర్ రెడ్డి తుది శ్వాస విడిచారని రామస్వామి తెలిపారు. 1960లో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమంలో పాల్గొని, రాజకీయ రంగ ప్రవేశం చేసి,196472 రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా, జాతీయ అధ్యక్షులుగా విద్యార్థి ఉద్యమాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనూ, జాతియా స్థాయిలో అత్యున్నత శిఖరానికి తీసుకుపోయారు. 197278 వరకు ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ, కార్యదర్శివర్గ సభ్యులుగా, 1997 లో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, 2000లో కార్యదర్శిగా, 2010లో జాతీయ సహాయ కార్యదర్శిగా, 2012లో



ప్రధాన కార్యదర్శిగా, రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు.. అనారోగ్య కారణాలతో రాజకీయాలను 2019లో స్వచ్ఛందంగా విరమించుకున్నాడు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అని తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, సిపిఎం డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కే శ్రీనివాస్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఎండి మక్బూల్ సుధాకర్ గౌడ్, వడ్ల మంజుల, మహిళా సంఘం మండల కార్యదర్శి లలిత, వెంకటమ్మ, యశోద, అంజిరెడ్డి, యాదగిరి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** విద్యార్థుల సంక్షేమంలో సిబ్బంది సమన్వయం, విబేధాలు కారణంగా విద్యార్థుల ఇబ్బంది పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు.సంక్షేమ వసతి గృహాలలో ఆహారం, తాగునీటి నాణ్యత, సౌకర్యాలు కల్పన తదితర అంశాలపై క్లస్టర్ అధికారులు, హాస్టల్ పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కెజిబివి సంక్షేమ అధికారులు, జిల్లా కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో శనివారం క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్. మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి నాణ్యమైన భోజనం, విద్యను అందిస్తుంటే కొంత మంది ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయ లోపం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ముందు హెచ్చరికలు ఉండవని, సస్పెండ్ చేయడమే ఉంటుందని, నిర్లక్ష్యం సహించేది లేదని స్పష్టం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో ఉండి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన భోజనం, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో నూతన ఆహార మెనూను సైతం విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. వసతి గృహాల్లో ఆహారం, సౌకర్యాలు కల్పన పర్యవేక్షణకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించామని, సోమవారం నుండి క్లస్టర్, పోలీస్ అధికారులు ప్రతి హాస్టల్



తనిఖీ చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే సస్పెండ్ చేసేందుకు వెనుకాడబోమని విధుల నుండి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తల్లి తండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ విద్యార్థులు చదువుకుంటున్నారని వారిని మంచిగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. పర్యవేక్షణకు నియమించిన క్లస్టర్, ప్రత్యేక, పోలీసు అధికారులు సంయుక్తంగా ప్రతి సంక్షేమ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పన, వంటగది, సామాన్లు భద్రపరచు స్టోర్ రూము, కూరగాయలు, పాలు, ఇతర సామాగ్రిని నిశితంగా పరిశీలించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి ఎప్పటికప్పుడు వారి సమస్యలు తెలుసుకోవాలని ఏదేని సమస్య ఉంటే ఉపాధ్యాయులతో మాట్లాడి సమన్వయ లోపాలను గుర్తించాలని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు స్నేహపూరిత వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో మధ్యాహ్న భోజనం పరిశీలించాలనీ మండల విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు పడే అర్బన్ రెసిడెన్షియల్, కెజిబివి కొరికిషాల ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, డిఈఓ రాజేందర్, ఇంటర్మ డియట్ అధికారి వెంకన్న, అన్ని సంక్షేమ హాస్టళ్ల ప్రత్యేక అధికారులు, అన్ని శాఖల సంక్షేమ శాఖల అధికారులు, కో ఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులు, ఎస్వోలు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 23 (మహా):** ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకావాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని చెప్పారు. మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు ఏవి?

## మున్సిపల్ కమిషనర్‌కి కాంగ్రెస్ ఫిర్యాదు

**రాజేంద్రనగర్ మహా ;** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అక్రమ సెల్లార్ల తవ్వకాలు, అనుమతులు తీసుకున్న దానికంటే ఎక్కువగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ సంపదను కొల్లగొట్టే అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని శనివారం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర కి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు.వర్షాకాలం దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో అనేక అక్రమ సెల్లార్ తవ్వకాలతో పాటు అక్రమ కట్టడాలు యదేచ్ఛగా జరుగుతున్నా, విషయం తెలిసి కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు ముడిచి కూర్చున్నారు. నిర్మాణదారులు ఎటువంటి భయం లేకుండా ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు కొల్లగొడుతూ అక్రమార్కులు యదేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారు కమిషనర్ సానుకూలంగా స్పందించి, అక్రమ కట్టడాలు



చేపడుతున్న వర్షాకాలంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సెల్లార్లు తవ్వుతున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకొని యెడల ఈ సమస్యని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియాకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల సుదర్శన్, శంకర్, విష్ణు ,రాంప్రసాద్ రావు ,రవీందర్ ,మల్లేష్ ,హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లనిస్తాం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లనిస్తామని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్కటంటే ఒక్కటీ కూడా ఇళ్లను ఇవ్వలేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం గణపురం మండలం బుద్దారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొత్తం 90 మందికి మంజూరీ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభా వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, రెండేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే పిచ్చిపచ్చిట్లు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. మా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక అందిస్తుంటే చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దొంగే, దొంగ.. దొంగ.. అన్న చందంగా ఉందన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుండు సున్నా వేశారని, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పెద్ద గుండు సున్నా వేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్ బాబు

**భూపాలపల్లి, మహా :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జయశంకర్ భూపాలపల్లి ఆధ్వర్యంలో సెప్టెంబర్, 13 వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్,జిల్లా జడ్జి సి.హెచ్.రమేష్ బాబుతెలిపారు. జిల్లాల్లోని పోలీసు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్, వివాహ /కుటుంబ తగాదా కేసులు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులను మరియు రాజీ పడదగు ఇతర కేసులు పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కోర్టులలో పెండింగ్ లో ఉన్న తమ తమ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించుకొని లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు. కోర్టులలో లేని కేసులను ప్రీ లిటిగేషన్ ద్వారా న్యాయసేవాధికార సంస్థ లో పరిష్కరించుకోవాలని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, ఎక్కువ కేసులు పరిష్కరించుటకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలనీ వారు సూచించారు.

**మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయవాదులను అభినందించిన జిల్లా జడ్జ్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడ్వొకేట్స్ బార్



అసోసియేషన్ నుండి మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన తొమ్మిది మంది న్యాయవాదులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్ బాబు అభినందించారు. శిక్షణ ముగించుకొని వచ్చిన న్యాయవాదులు మర్యాదపూర్వకంగా ప్రధాన న్యాయమూర్తి ని శనివారం కలిశారు. జడ్జి మాట్లాడుతూ కేసుల్లోని ఇరువర్గాలను సమన్వయ పరిచి కేసుల పరిష్కారానికి కృషిచేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఏ.నాగరాజ్ , ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ ,శిక్షణ పొందిన న్యాయవాదులు ఆనందరావు , కవిత, రాజ్ కుమార్, శివ కుమార్, రవీందర్, రమేష్ , రవి కుమార్, సంధ్య , విష్ణు, ఏఎస్పి ఏ నరేష్ కుమార్, కాటారం డిఎస్పి సూర్యనారాయణ , సిఐలు,ఎస్సైలు, పాల్గొన్నారు.



# సురవరం సేవలు మరువలేం

## సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**రాజేంద్రనగర్ మహా ;** కమ్యూనిస్టు యోధుడు, మార్క్సిస్టు మేధావి, సిపిఐ అఖిలభారత, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, అకాల మరణం సిపిఐ పార్టీ నాయకులకు, తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద, శనివారం సురవరం సుధాకర్ రెడ్డి, చిత్రపటానికి సిపిఐ నాయకులతో కలిసి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే రోజుల్లో, విద్యార్థి యువజన ఉద్యమంలో, చురుకైన పాత్ర పోషిస్తూ, విప్లవాల వైపు రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. సిపిఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా, నల్లగొండ ఎంపీగా ప్రజలకు, సేవ చేసిన మహా నాయకుడు, సురవరం సుధాకర్ రెడ్డి అని ఆయన కొనియాడారు. ఇలాంటి విప్లవ నాయకులను కోల్పోవడం, ప్రజా పోరాటాలకు ఉద్యమాలకు నష్టం కలిగిస్తాయిఅన్నారు. సుధాకర్ రెడ్డి ఆశయాలను, కొనసాగించడానికి, ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు పుస్తకాల నర్సింగరావు, పానుగంటి పర్వతాలు, కే రామస్వామి, ఓరుగంటి యాదయ్య, టి రామకృష్ణ, బుద్ధుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం, ఆర్ యాదగిరి, పల్నాటి యాదయ్య, ఎం ఏ రియాజ్, నరసింహారెడ్డి, కే చందు యాదవ్, ఎం సత్తిరెడ్డి, ఆనంద గౌడ్, శ్రీశైలం, మంజుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాల్లో అప్రమత్తంగా ఉండాలి



- శాంతియుతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి
- పీస్ కమిటీ సమావేశంలో శంషాబాద్ డీసీపీ రాజేష్

**ఆమనగల్లు, మహా:** శాంతియుతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని శంషాబాద్ డిసిపి రాజేష్ అన్నారు.అమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్లో గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులతో ఎస్ఐ వెంకటేష్ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శంషాబాద్ డిసిపిరాజేష్ ,కడ్తాల్ సీఐ గంగాధర్, తహసీల్దార్, ఎంపిడిఓ,మున్సిపల్ కమిషనర్, విద్యుత్ అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా డిసిపి మాట్లాడుతు . మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని, విగ్రహాలు ప్రసిద్ధించే మండపాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.భారీ విగ్రహాలు ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనానికి సంబంధించిన రూటు మ్యాప్‌ను ముందే తెలియ జేయాలన్నారు. ఊరేగింపుల్లో బాణసంచా ఉపయోగించరాదని, డీజే శబ్దాలు నిరోధించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకూడదన్నారు. పోలీస్ శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలు ఎదుటి వారికి ఇబ్బందులు కలుగకుండానిర్వహించుకోవాలని,నిర్వాహకులు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా కోసం నాణ్యమైన విద్యుత్ తీగలనే వాడాలన్నారు. డీజేకు అనుమతి లేదన్నారు. ప్రధాన మండపాల వద్ద నిర్వాహకులే సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు.వినాయక మండపం ఏర్పాటుకు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి పత్రం పొందాలని వెల్లడించారు. మండపం ఏర్పాటుకు ఈhttps://policeportal.tspolice.gov.in/index.htm లింక్ ద్వారాఆన్‌లైన్‌లో అప్లై చేసిన తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్‌కు దరఖాస్తు కాపీ ఖచ్చితంగా సమర్పించాలన్నారు. మండపాలను రహదారులు, అంబులెన్స్ మార్గాలు, అగ్నిమాపక వాహనాల మార్గాలకు అడ్డంకులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా అమర్చాలని, షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకొని ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తప్పనిసరిగా ఉంచాలని తెలిపారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.అంతకుముందు మున్సిపల్ కమిషనర్ శంకర్ తో కలిసి నిమజ్జన స్థలాన్ని డిసిపి, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.

**వేడుకల్లో డీజేలు పూర్తిగా నిషేధం**

వేడుకల్లో డీజేలు పూర్తిగా నిషిద్ధమని.. మైక్ పర్మిషన్ కోసం సైతం పోలీస్ అధికారులను సంప్రదించి పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. మండపాల్లలో విద్యుత్ సరఫరా కోసం నాణ్యమైన విద్యుత్ తీగలను వాడాలని.. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రతి గణేష్ మండలి వద్ద ఉదయం, రాత్రి వేళల్లో ఇద్దరూ లేదా ముగ్గురికి తక్కువ కాకుండా తమ కమిటీ మెంబర్లు గణేష్ మండలిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి గణేష్ మండలి వద్ద విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.గణేష్ మండళ్ల వద్ద సందర్శించే మహిళలపై, యువతులపై ఈవ్ టీజింగ్ జరుగకుండా మండళ్ల నిర్వాహకులు చూసుకోవాలని పేర్కొన్నారు. డీజే, డీజే మిక్సర్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని.. ఆస్పత్రుల వద్ద.. పాఠశాలల వద్ద భారీ శబ్దంతో పాటలు పెట్టవద్దనివెల్లడించారు.ఈ సమావేశంలో కడ్తాల్ సిఐ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎఈ ఎలక్ట్రిసిటీ శంకర్ నాయక్, ఆర్&బి ఎఈ తిరుపతి రెడ్డి, ఎంపీడీఓ రెహమాన్ రెవిన్యూ ఆర్ఐ సంపంత్ ,డాక్టర్ మంజుల,ఎఈ ఇరిగేషన్ తిరుపతయ్య,మార్కెట్ చైర్మన్ యాట గీత నర్సింహా, మండప నిర్వాహకులు, వివిధ యువజన సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

# కొడవటంచ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్

**భూపాలపల్లి, మహా :** రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం సాయంత్రం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర నారాయణ రావు పరిశీలించారు. ఆలయ గర్భగుడితో పాటు ఆలయ పరిసరాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సదరు గుత్తేదారు, కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించారు. అన్ని పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. అంతకుముందు ఎమ్మెల్యే బాలాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన సిరికొండ అమృతా రావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. వారి చిత్రపటం వద్ద ఎమ్మెల్యే పూలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.





# ఉత్తమ ఫొటో గ్రాఫర్ కు ఘన సన్మానం

**వరంగల్ మహా;** ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్ట్ లకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫోటో గ్రాఫర్లను ఎంపిక చేయడం జరిగింది. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల పై అవగాహన కలిపించే సృజనాత్మకతను కలిపించే ఫోటోలను ఎంపిక చేసారు. ఇందులో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మేరుగు ప్రతాప్ ఫోటో జర్నలిస్ట్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫోటో గ్రాఫర్‌గా అవార్డ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం ప్రతాప్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అయూబ్ శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమం లో పాపని భాస్కర్, కుచన రవి, అమృత రావు, ఐత క్రాంతి, కిన్నెర రవి, తదితరులు, పాల్గొన్నారు.

# భూపాలపల్లి యూఆర్ఎస్ స్కూల్లో జరిగిన ఘటనపై ఉపేక్షించేది లేదన్న ఎమ్మెల్యే జీఎస్సార్..

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా కేంద్రం గాంధీనగర్ లోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ఎస్)లో కలుషిత నీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అడిషనల్ కలెక్టర్లు, డీఈవో, డీఎస్పీ ఇతర అధికారులతో కలిసి స్కూల్, హాస్టల్ ను పరిశీలించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 11 మంది విద్యార్థులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్సీ స్కూల్ లో జరిగిన ఘటన విచారకరమని అన్నారు. ఈ విషయమై సమగ్ర విచారణ చేపడుతున్నామని అన్నారు. స్కూల్ ఆవరణలో ఓ టీచర్ గదిలో ఉన్న దగ్గు మందు సీసా లో ఉన్న ను పురుగు మందులకు సంబంధించిన ద్రావణం ఉన్నట్లు విచారణలో తేలిందని అన్నారు. అర్బన్ పాఠశాలలో మొత్తం 40 మంది విద్యార్థులు వున్నారని వారి అభి



ప్రాయం తెలుసుకోవడం జరిగిందన్నారు. టీచర్ల మధ్య గ్రూపు విబేధాలు ఉన్నట్లు తెలుస్తుందని వారి తగాదాల్లో పిల్లలను ఆగం చేసే కుట్ర చేశారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతి గృహాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు కూడా పెంచడం జరిగిందన్నారు. గతంలో మొగుళ్ళపల్లి మండలం కొరికిశాల కేజీబీవీ స్కూల్లో ఎస్ఓ, పిఈటి మధ్యలో విభేదంతో ఇలానే జరిగిందని గుర్తు చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ఈ ఘటనపై లోతుగా విచారణ మొదలుపెట్టిందని, పిల్లల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన చికిత్స అందుతుందని, ఎవరూ ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే సూచించారు.



# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలి

**రాజేంద్రనగర్ మహా ;** సిపిఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానమును పునరుద్ధించాలని, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, టి పి యు ఎస్ సభ్యులతో కలిసి మండల అధ్యక్షులు ఏం బాలకృష్ణ, రాజేంద్రనగర్ మండల ఎమ్మార్వో బొమ్మ రాములును కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన కోరికలన్నీ, నెరవేరుతాయని ఎన్నో కలలుగన్నం, కానీ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే, ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలను అడియాశలు చేస్తూ ఆగస్టు 23 2014లో జీవో నెంబర్ 28 తీసుకొని వచ్చారు. ఈ జీవో ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న విధంగానే 01, 09, 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరికీ ( సిపిఎస్ ) కొత్త పెన్షన్‌ను వర్తింపజేయాలని నిర్ణయం తీసుకోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్ట్ ద్వారా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపు సిపిఎస్‌ను రద్దు చేస్తామన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయుల పక్షాన సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేస్తుందన్నారు.

మహా పత్రిక 07
తెలుగు
ఆదివారం, హైదరాబాద్ | 24-08-2025 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# మంత్రి చొరవతో అర్చకులు, ఈవోలకు పదోన్నతులు



**వరంగల్ మహా ;** రాష్ట్ర దేవాదాయ శాఖలో ఏండ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ఆలయాల అర్చకులు, ఈవోలకు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో దేవాదాయ శాఖ పదోన్నతులు లభించాయి. ఈ మేరకు శనివారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ పదోన్నతి పొందిన అర్చకులు, ఈవోలకు ఆర్డర్ కాపీలను అందజేశారు. వివిధ దేవాలయాలలో పనిచేస్తున్న అర్చక, సిబ్బందికి జీవో ఎంఎస్. నం.261 ప్రకారం14 వేదపరాయణం చేసేవారికి గ్రేడ్III నుంచి II, గ్రేడ్II నుంచి I, 2పోస్టులు మొత్తం 16 మంది అభ్యర్థులను ఎంపిక చేసిన వీరికి మంత్రి ఉత్తర్వులు అందజేశారు. ఈఓ గ్రేడ్III నుంచి ఈఓగ్రేడ్II ఇద్దరు, మోఫిసిల్ సీనియర్ అసిస్టెంట్ నుంచి ఈఓ గ్రేడ్II ఒకటి, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ నుంచి కన్వర్షన్ ఆఫ్ సర్వీసెస్ కింద ముగ్గురు అభ్యర్థులకు ఈఓ గ్రేడ్III గా మంత్రి సురేఖ ఉత్తర్వులను అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ క్యాటగిరిలో పదోన్నతులు పొందాల్సిన ఫీడర్ క్యాటగిరీస్ అయిన ఈఓ గ్రేడ్I, మోఫిసిల్ సూపరిండెంట్స్, ప్రముఖ దేవాలయాల్లోని ఏఈఓ ల సీనియారిటీలు వివిధ కారణాలతో ఆగిపోగా.. ప్రభుత్వం సమీక్షించేందకు ఉత్తర్వులు జారీ చేసింది. డిపార్ట్మెంటల్ పదోన్నతులను త్వరిత గతిన పరిష్కరించడానికి డిపార్టుమెంటు సిబ్బందితో పాటు జీఏడీ లో పనిచేసిన అనుభవం ఉన్న విశ్రాంత ఉద్యోగులతో కమిటీ వేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంటు డైరెక్టర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఏడీసీ శ్రీనివాసరావు, జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, డిప్యూటీ కమిషనర్ వినోద్ కుమార్, కృష్ణప్రసాద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**అర్చకులు మెడికల్, రిటైర్మెంట్ బెనిఫిట్స్**

దేవాదాయ శాఖలోని ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పదవీ వీరమణ చేసిన అర్చక, ఇతర ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.4.00 లక్షల నుంచి రూ.8.00 లక్షలకు పెంచడానికి, హోసింగ్ లోన్లో రూ.10 లక్షల వరకు బ్యాంకు వడ్డీ, ఇతర సౌకర్యాలు అర్చక సంక్షేమ నిధి ద్వారా లబ్ధి చేకూర్చేందుకు మంత్రి సురేఖ ప్రత్యేకంగా కృషిచేశారు. దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు, ఇతర సిబ్బంది నలుగురికి మెడికల్ రీయంబర్స్మెంటు ప్రొసిడింగ్స్ అందజేశారు.

**10 ఆలయాల అభివృద్ధికి చర్యలు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం బంగారు గోపురం మొదలు కొని దేవాదాయశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మంత్రి సురేఖ ఎండోమెంట్ డైరెక్టర్ వెంకటరావు ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని 10 పెద్ద దేవాలయాల అధివృద్ధి కోసం భక్తులకు మెరుగైన వసతుల కల్పించేందుకు మాస్టర్ ప్లాన్కు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

**మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు**

చాలా సంవత్సరాలు పెండింగులో ఉన్న అర్చకులు, ఈవో ల సమస్యను పరిష్కరించినందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదోన్నతుల కోసం ఎన్నో ఏండ్లు తిరిగినా కాలేదని మంత్రి స్వయంగా ఈ విషయాన్ని ప్రత్యేక చొరవతో ముందుకు తీసుకెళ్ళారని ఇందుకు మాకు సంతోషంగా ఉన్నదని వారు తెలిపారు.



# అమృత్ 2.0 పనులు వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** ఆగస్టు 23, ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పనులు వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పనులను తహసిల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేష్ లతో కలిసి పరులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా నివాసాలకు త్రాగునీరు అందించడంతో పాటు అమృత్ 2.0 పథకంలో నిర్మిస్తున్న నీటి ట్యాంకుల ద్వారా త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సబ్ కలెక్టర్ మనోజ్, తహసిల్దార్ కృష్ణ లతో కలిసి సందర్శించి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జ్వర పీడితులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఆసుపత్రికి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. డయాలసిస్ సెంటర్ ను పరిశీలించి కిడ్నీ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కన్నాల గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కొరకు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంచి నీటిలో పురుగుమందు మిక్స్

**అస్వస్థతకు గురైన విద్యార్థులు**

- 100 పడకల ఆసుపత్రిలో చికిత్స
- ఎమ్మెల్యే పర్యటనతో బయటపడిన కుట్ర
- రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ, కలెక్టర్



**భూపాలపల్లి, మహా :** రెసిడెన్షియల్ పాఠశాలలో టీచర్ల మధ్య గల విభేదాలు విద్యార్థులకు ప్రాణ సంఘటన మారింది. వివరాలలోకెళితే భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు మంచినీరు తాగడంతో తీవ్ర స్వస్థతకు గురయ్యారు 11 మంది విద్యార్థులు 100 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అప్పటివరకు బాగానే ఉంది. శనివారం ఉదయం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రెసిడెన్షియల్ హాస్పిటల్ సందర్శించారు. సమస్యను తెలుసుకునేందుకు విద్యార్థులందరి తో మాట్లాడారు పలువురు విద్యార్థులు టీచర్లు పురుగు మందు కలిపిన విషయమై ఎమ్మెల్యేకు వివరించారు. పనిచేసే టీచర్లు వారి మధ్యన ఉన్న విభేదాలతో ఒకరికొకరికి పడక విద్యార్థులు తాగే నీటిలో మోనో పురుగుమందు కలిపినట్లు టీచర్ల ప్రఖ్యానం బయటపడింది పోలీసులు సంఘటనపై విచారణ జరుపుతున్నారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే వివిధ శాఖల ఉన్నతాధికారులు హాస్టల్ ను సందర్శించారు.

**జిల్లాలో ఇది రెండో ఘటన**

భూపాలపల్లి జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ మరియు కలుషిత నీరుతో విద్యార్థులు అస్వస్థకు గురైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మొగుళ్ళపల్లి మండలం కోర్కిశాల కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ లో ఫుడ్ పాయిజాన్ జరిగింది, 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు విద్యార్థినిలకు వాంతులు వీరేచనాలు చేసుకున్నారు. ఇదే క్రమంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కలుషిత నీరు తాగి 11మంది విద్యార్థులు అస్వస్థత గురి అయ్యారు. వారిని హుటాహుటిన జిల్లా కేంద్రంలోని వంద పడకల హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నరు వైద్యులు. జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు చోటు చేసుకోవడంతో పిల్లల తండ్రులందులు ఆందోళనకు గురవుతున్నారు.

# ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించాలి

**మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో గణేష్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్లపై గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో సిఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, అడిషనల్ డిసిపి సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కెపివి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపి సునీత రెడ్డి, మాట్లాడుతూ... ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయడం జరుగుతుందని, వినాయక మండపాలు నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించాలన్నారు. పరిమితికి మించి డిజె సౌండ్లను పెట్టుకోవద్దని ఎలాంటి గొడవలకు తావు లేకుండా శోభాయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు. కేబుల్ వైర్లు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. సూచించిన ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి, మంచాల సీఐ మధు, ఆదిభట్ల సీఐ రవికుమార్, ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, యాచారం ఎమ్మార్వో అయ్యప్ప, పోలీస్ సిబ్బంది, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళపై చేయి చేసుకున్న ఎస్ఐ

**వరంగల్ మహా;** వరంగల్ మిల్స్ కాలనీ ఎస్సై దళిత మహిళ మరియమ్మ పై చేయి చేసుకోవడం నగరంలో వివాదాస్పదమైంది. ప్రశ్నించినందుకు తన పై చెయ్యి ఎస్సై చేసుకున్నాడని మరియమ్మ ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానికులు, మహిళ ఇచ్చిన సమాచారం మేరకు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సదరు మహిళ ఓ హోటల్ నిర్వాహకురాలు అని ఈమె తరచూ రోజు అర్ధరాత్రి వరకు హోటల్ నిర్వహణ కొనసాగిస్తున్నారని అటుగా వచ్చిన పెట్రోలింగ్ పోలీసులు ఎస్సై హోటల్ వద్దకు వెళ్లి హోటల్ బంద్ చేయాలని తెలుపుతూ అక్కడ ఉన్న గ్యాస్ సిలిండర్ ను తీస్తుండగా, ఎందుకు తీస్తున్నారని నిర్వాహకులు ఎస్సైతో వాదన చేయగా విధి నిర్వహణలో ఉన్న ఎస్సై తనతో అమర్యాదగా ప్రవర్తించి దుర్భాషలాడుతూ తన పై దాడి చేసినట్లు ఆమె తెలిపారు. దీనిపై మహిళ కుమారుడు వరంగల్ ఏఎస్పీ ఆఫీసులో ఫిర్యాదు చేసి ఆపై మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేస్తాడని సమాచారం. సదరు మిల్స్ కాలనీ ఎస్సై రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో హోటల్ నిర్వాహకురాలు మరియమ్మ రోజు అర్ధరాత్రి వరకు హోటల్ నిర్వహిస్తున్నారని, పోలీసులు పలుమార్లు నిబంధనలు ఉల్లంఘించవద్దని సదరు ఆ మహిళకు తెలపడం కూడా జరిగిందని ఇదే క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి అందాజ 12:30 హోటల్ మూసివేయాలని చెబుతున్న కూడా వినకుండా మహిళ విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో అమర్యాదగా మాట్లాడిందని పైగా సదురు మహిళ కుల ప్రస్తావన అక్కడ రాలేదని వారి కులం మతం ఏమిటో తనకు ఏమాత్రం తెలియదని తెలుసుకోవాల్సిన అవసరం కూడా లేదని ఎస్సై వివరణ ఇచ్చారు.

# రూ.300 కోట్లతో నర్మెట్టలో ఆయిల్ పామ్ పరిశ్రమ సిద్ధం

- రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై దృష్టి
- రైతుల బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు
- ప్రతి నెలా పురోగతిపై మంత్రి తుమ్మల సమీక్ష

**ఖమ్మం, మహా:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం, నర్మెట్ట గ్రామంలో దాదాపు రూ.300 కోట్లతో నిర్మితమైన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ పరిశ్రమ పూర్తి స్థాయిలో సిద్ధమై, ప్రారంభోత్సవానికి సన్నద్ధమైంది. ఈ ఫ్యాక్టరీ ప్రారంభం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఆయిల్ పామ్ రైతులకు నేరుగా లాభం చేకూరనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. డా. బీఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం జరిగిన కీలక సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల ఆయిల్ పామ్ సాగు, పరిశ్రమల విస్తరణపై సమగ్ర చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రాఘునందన్‌రావు, హార్టికల్చర్ ఎండీ యాస్మీన్ భాషా ఐఏఎస్‌తో పాటు ఆయిల్ ఫెడ్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి సంబంధించి ఏ చిన్న లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయిల్ ఫెడ్ అధికారులకు మంత్రి సూచించారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా సాగులో ఉన్న ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ల పురోగతిని వేగవంతం చేసేలా క్రమపద్ధతిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తయ్యేలా కఠినమైన నిబంధనలు పాటించాలని మంత్రి హెచ్చరించారు. ఇకపై ఆయిల్ పామ్ సాగు, పరిశ్రమలపై ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి పురోగతిని పర్యవేక్షిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** ప్రశాంత వాతావరణంలో గణేష్‌ఉత్సవాలనునిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, జి డబ్ల్యుఎంసి కమిషనర్, సంబంధిత శాఖ అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ, హిందూ ధర్మ పరిషత్, ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు పోటీ తత్వంతో కాకుండా భక్తి భావంతో నిర్వహించాలని తెలిపారు. గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ నుండి అనుమతులు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. వాతావరణం కలుషితం కాకుండా ఉండేందుకు మట్టి వినాయకులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని, నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులను కోరారు. గత ఉత్సవాలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించుకునే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారికి సహకరించాలని కోరారు. గతంలో ఏర్పాటు చేసిన ఉత్సవ మండపాలకు ఎటువంటి అంతరాయం కలిగించకూడదని అదేవిధంగా ఏర్పాటు చేయడం మండపాలు భూతగాదాలు, వివాదమయ్యే ప్రదేశాలలో అనుమతులు ఇవ్వకూడదని పోలీసులకు సూచించారు. డీజే సౌండ్ సిస్టం అనుమతించకూడదని, మండళ్లు ఏర్పాటు చేసిన చోట్ల, సౌండ్ సిస్టం, నిమజ్జన సమయంలో భక్తి భావనతో కూడిన పాటలను మాత్రమే వేసే విధంగా చూడాలని కోరారు. గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి ఒకెరోజు రావడం వలన ఎటువంటి మతసామరస్య దెబ్బతినకుండా ఉండేవిధంగా ముస్లిం సోదరులు సహకరించాలని కోరారు. ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా ఉత్సవాల నిర్వహించుకోవాలని కోరారు. నిమజ్జనం చేసే రోజు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, బారికేడ్ల ను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాల వద్ద చేపట్టాల్సిన చర్యలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టరు స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా పరిధిలో 12 నిమజ్జనం ప్రదేశాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులకు తగు సూచనలు ఇవ్వడం జరిగిందని పారిశుద్ధ్యం మండపాల వద్ద నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్తు ఏర్పాటు, క్రేన్లు ఎటువంటి దురదృష్టకర సంఘటన ల జరగకుండా ఉండేందుకుగాను ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు ఆర్ అండ్ బి శాఖ ద్వారా భారీకేడ్ల ఏర్పాటు, మత్స్య శాఖ ద్వారా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. నిమజ్జనోత్సవం సందర్భంగా చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకునేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్మాట్లాడుతూ జనగామ జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో 35 వరకు చెరువులు జిల్లావ్యాప్తంగా ఉన్నాయని అన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేస్తామన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు.

**మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని గణేష్ నిమజ్జన ప్రదేశంలో ముఖ్యంగా చిన్న వడ్డేపల్లి, పద్మాక్షి టెంపుల్ మున్నగు వరంగల్ జిల్లా పరిధిలో 15, హనుమకొండ జిల్లా పరిధిలో 12, నిమజ్జన ప్రదేశాలలో వివిధ పనులు నిర్వహణకు గాను 18 లక్షలు రూపాయలు కేటాయించడం జరిగిందని, మూడు విడతల శానిటేషన్ తాగునీటి సౌకర్యం చెరువులో గుర్రపు డెక్కలను తొలగించడం సిబ్బందికి భోజన సౌకర్యం ఏర్పాటు, హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడం విగ్రహాల నిమజ్జనానికి ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు క్రేన్లను తగినంత ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ వరంగల్ జనగామ జిల్లాల ఆదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ముస్లిం పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ హితం కోసం మట్టి ప్రతిమలను పూజించండి

**నగర మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ మహా;** పర్యావరణ హితం కోసం మట్టి ప్రతిమలను పూజించాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర మేయర్, కమీషనర్ చాహాత్ బాజ్ పాయి లు పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను మెప్మా ఆర్.పి.లు, ఎస్ హెచ్ జిలు, బల్దియా సిబ్బందికి పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు గా బల్దియా ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి ద్వారా కేటాయించే మట్టి వినాయకులను మెప్మా, బల్దియా సిబ్బందికి పంపిణీ చేస్తున్నామని, ఈ సంవత్సరం సుమారు 50 వేల విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల ఏర్పడిన కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, అందమైన సమాజాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకోసం నగర ప్రజలకు ఆదర్శం గా నిలవడానికి బల్దియా తరపున ఆర్.పి.లు, ఉద్యోగులు, సిబ్బంది కి మట్టి విగ్రహాలను అందజేయడం జరిగిందని, నగర ప్రజలు పర్యావరణ స్ఫూర్తిని కొనసాగిస్తూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని అన్నారు. బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్ లలో మట్టి వినాయక ప్రతిమలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. చెరువులో నిమజ్జనం చేసిన మట్టి విగ్రహాల వల్ల చెరువు నీరు కలుషితం కాకుండా ఉంటాయని తెలిపారు. కమిషనర్ చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ పిఓపి కు బదులు కాలుష్య రహిత మట్టి విగ్రహాలను పూజించే విధంగా ఎస్ హెచ్ జిలు, మహిళలలో చైతన్యం కల్పిస్తూ ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కమిషనర్ జోనా, సిహెచ్ ఓ రమేష్, సి.ఎం.హెచ్.ఓ రాజారెడ్డి,ఎంహెచ్ఓరాజేష్,ఉప కమిషనర్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మంలో డ్రెయిన్ పనుల పరిశీలన

**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్‌లో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్వయంగా పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ నిర్వహించిన కమిషనర్, పనుల నాణ్యత, ప్రమాణాలపై సమగ్ర సమాచారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయడంతో పాటు నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ పర్యటనలో అధికారులు పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను వివరించారు. మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా, మౌలిక వసతులు మెరుగుపడేలా ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన పర్యావరణం, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే తమ లక్ష్యమని కమిషనర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ టీపీసీసీ జనహిత పాదయాత్ర

**25, 26న మీనాక్షి నటరాజన్ పర్యటన**



**హన్మకొండ మహా;** హనుమకొండ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మగాని మహేష్‌కుమార్ గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా చేపట్టిన జనహిత పాదయాత్ర ఈనెల 25, 26 తేదీల్లో వర్ధన్నపేటలో నిర్వహించనున్నారు. జనహిత పాదయాత్రను విజయవంతం చేయడమే లక్ష్యంగా శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా పార్టీ వ్యవహారాల ఇంచార్జి, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పాల్గొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, లక్ష్మణ్ నాయక్, పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రాజ్ ఠాకూర్, యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, నమిండ్ల శ్రీనివాస్, ధర్మారావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి శ్రీనివాస్, బొడ్డిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీను బాబు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాష్, పైడాకుల అశోక్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**2 రోజులు వర్ధన్నపేటలోనే..**

సమీక్ష సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు నిర్వహిస్తున్న ఈ పాదయాత్ర ద్వారా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలు అందరికీ వివరించే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి నేతృత్వంలో పాదయాత్ర జరుగుతుందని వివరించారు. ఈ నెల 25న సాయంత్రం నాలుగు గంటలకు వర్ధన్నపేట మండలం ఇల్లంద మార్కెట్ నుంచి వర్ధన్నపేట టౌన్ అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 26వ తేదీ ఉదయం 6.30 గంటలకు వర్ధన్నపేట టౌన్ ఫిరంగిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం, ఉదయం 10 గంటలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి దర్శించుకోనున్నారు. 11.30 గంటలకు వర్ధన్నపేట టౌన్ శివారులోని లక్ష్మి గార్డెన్స్ లో జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి ముందు నిన్న సాయంత్రం పరమపదించిన వామపక్ష సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కామెరూన్‌తో ఫస్ట్ లుక్ రిలీజ్?

హీరో మహేశ్‌బాబు–దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్‌ను సెప్టెంబరులో నైరోబీ, టాంజానియా, సౌత్ ఆఫ్రికా లొకేషన్స్‌లో ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. కాగా ఈ సినిమా అప్‌డేట్‌ను నవంబరులో వెల్లడిస్తామని మహేశ్‌బాబు బర్త్ డే సందర్భంగా ఈ ఆగస్టు 9న రాజమౌళి పేర్కొన్నారు. ఈ సినిమాకు 'జెన్ 63' అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఇక 'అవతార్: ఫైర్ అండ్ యాష్' సినిమా ప్రమోషన్స్ కోసం చిత్రదర్శకుడు జేమ్స్ కామెరూన్ ఇండియా వచ్చినప్పుడు ఈ 'జెన్ 63' ఫస్ట్ లుక్, ప్రమోషనల్ కంటెంట్‌ను ఆయన చేతుల మీదుగా రిలీజ్ చేస్తే గ్లోబల్ రేంజ్‌లో రీచ్ ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇదిలా ఉంటే... 2023లో జరిగిన ఓ అంతర్జాతీయ అవార్డుల వేడుకలో భాగంగా రాజమౌళి, జేమ్స్ కామెరూన్ కలుసుకున్న సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ సమయంలో 'ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని కామెరూన్ ప్రశంసించారు. ఇదిలా ఉంటే... జేమ్స్ కామెరూన్ డైరెక్షన్‌లోని 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చిత్రం ఈ డిసెంబరు 19న తెలుగులోనూ రిలీజ్ కానుంది.



## కీ రోల్‌కి సై

విశాల్ హీరోగా రవి అరసు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దుషారా విజయన్ కథానాయికగా నటిస్తున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌పై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ కెరీర్‌లో 35వ మూవీగా రూపొందుతోన్న ఈ చిత్రంలో హీరోయిన్ అంజలి కీ రోల్‌లో నటిస్తున్న విషయాన్ని మేకర్స్ ప్రకటించారు. "అంజలి ప్రస్తుతం ఆచితూచిపాత్రలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో విశాల్ 35 కథ నచ్చి, ఆమె ఓకే చెప్పారు. 'మద గద రాజా' చిత్రంలో అంజలి, వరలక్ష్మిలతో విశాల్ చేసిన సందడికి కాసుల వర్షం కురిసింది. మళ్లీ ఇప్పుడు విశాల్, అంజలి కాంబోలో ఈ సినిమా రాబోతోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది" అని యూనిట్ తెలిపింది.

## స్ట్రాంగ్‌గా ఉండే అమ్మాయిలను చూసి ఓర్వలేరు.. అందాలు భద్రపరిచా

గతంలో రెండు బ్రేకప్స్ జరిగాయంటోంది బాలీవుడ్ హీరోయిన్ డైసీ షా. అందులో తనను బాగా ఇబ్బంది పెట్టిన రిలేషన్‌షిప్ గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. ఓ అబ్బాయితో చాలా ఏళ్లు రిలేషన్‌లో ఉన్నాను. మొదటి నాలుగేళ్ల సమయంలో అసలు పెళ్లి ఆలోచనే రాలేదు. తర్వాత నాకు ఆ ఆలోచనే రాకుండా చేశాడు. ఏడో సంవత్సరంలో ఉండగా.. నేను సంతోషంగా లేనన్న విషయాన్ని గ్రహించి బ్రేకప్ చెప్పాను. రెండో రిలేషన్‌లో పరిస్థితి మరీ దారుణం. నేనెక్కడికి వెళ్తున్నా?.. అబ్బాయిలతో కలిసి పని చేస్తున్నానా? ఇలా ప్రతీది గుచ్చిగుచ్చి అడిగేవాడు. ఇక్కడ ఆశ్చర్యకర విషయమేంటంటే.. అతడు కూడా ఇదే ఇండస్ట్రీలో ఉన్నాడు. ఒకసారి మేమిద్దరం పార్టీలో ఉన్నాం. ఫ్రెండ్స్‌తో కలిసి డ్యాన్స్ చేస్తున్నాం. ఇంతలో ఒకరు నా వెనక నుంచి వచ్చి చేయి పట్టుకుని లాగి తనతో డ్యాన్స్ చేయమని అడిగాడు.

### నా తప్పేముంది?

అందులో తప్పేముంది? దానికి నాపై కోప్పడాల్సిన అవసరం లేదుకదా! కానీ అతడు మాత్రం వేరే అమ్మాయిలతో డ్యాన్స్ చేస్తూ తనను అర్థం చేసుకోమన్నాడు. అతడి పద్ధతి నాకు చిరాకు తెప్పించేది. నన్నెప్పుడూ కంట్రోల్ చేయాలని చూసేవాడు. దానివల్ల మరింత ఫ్రస్టేట్ అయ్యేదాన్ని. బలమైన అమ్మాయిలను చూసి మగవాళ్లు అస్సలు ఓర్వలేరు. అలాంటివాళ్లను చాలామందిని చూశాను. ఇప్పట్లో అయితే పెళ్లి చేసుకోవాలన్న ఆసక్తి లేదు. పైగా నేను ఆర్థికంగా బాగానే ఉన్నాను. నా పోషణ కోసం ఒక మగవాడి తోడు అవసరం లేదు. అయితే నా స్నేహితురాలి సలహాతో అందాలు భద్రపరిచాను అని చెప్పుకొచ్చింది.

### కెరీర్

డైసీ షా.. ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్యకు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్ మొదలుపెట్టింది. భద్ర అనే కన్నడ చిత్రంతో హీరోయిన్‌గా మారింది. సల్మాన్ ఖాన్‌తో చేసిన 'జై హో' మూవీతో మంచి గుర్తింపు అందుకుంది. ఈమె చివరగా మిస్టరీ ఆఫ్ ద టాటూ మూవీ చేసింది. గతేడాది వచ్చిన రెడ్ రూమ్ అనే వెబ్ సిరీస్‌లో కనిపించింది. మరో రెండు రోజుల్లో (ఆగస్టు 25న) డైసీ షా 41వ వయసులోకి అడుగుపెట్టనుంది.



## ఆ సీన్ కోసం 28 టేకులు.. ఆ విషయం ఎప్పుడు గుర్తొచ్చినా..

'పరిణీత' చిత్రంతో విద్యాబాలన్ కెరీర్ మొదలైంది. ఈ సినిమా 2005 జూన్ 10న విడుదలైంది. శరత్ చంద్ర చటోపాధ్యాయ రాసిన పరిణీత (1914) అనే బెంగాలీ నవల ఆధారంగా ఈ మూవీ తెరకెక్కింది. సంజయ్ దత్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రదీప్ సర్కార్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ 20 ఏళ్ల తర్వాత రీరిలీజ్ అవుతోంది. ఆగస్టు 29న మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

### ఇంత పరిచయమా? నాకు తెలీదు

ఈ సందర్భంగా విద్యాబాలన్ ఆనాటి సంగతులను గుర్తు చేసుకుంది. నాకు బాగా గుర్తు.. సైఫ్ అలీ ఖాన్ తల్లి, బాలీవుడ్ స్టార్ షర్మిల ఠాగూర్ (Sharmila Tagore) ఓరోజు సెట్‌కు వచ్చింది. తనను చూసేందుకు నేను చాలా ఎగ్జయిట్ అయ్యాను. ఆవిడంటే నాకెంతో ఇష్టం. మామధ్య ఎంతో అనుబంధం ఉందన్నట్లుగా ఒకరినొకరం పలకరించుకున్నాం. అది చూసిన సైఫ్.. ఓహ్, మీ ఇద్దరికీ ఇంత పరిచయముందని నాకింతవరకు తెలీదు అని సరదాగా జోక్ చేశాడు.

### ఎప్పుడు గుర్తు చేసుకున్నా..

వెంటనే నేను నాకు ఆమె తెలుసు.. కానీ తనకు నేను తెలియదని బదులిచ్చాను. సైఫ్ సరదాగా ఉంటూ ఎప్పుడూ నవ్విస్తుంటాడు. ఆ సంఘటన ఇప్పుడు గుర్తు చేసుకున్నా నవ్వొస్తుంటుంది. దాదా(ప్రదీప్ సర్కార్) వల్లే నటనలో మెళకువలు నేర్చుకున్నాను. ప్రతి చిన్నవిషయాన్ని కూడా గుర్తించి సీన్ మళ్లీ చేయిస్తాడు. అవసరమైతే వంద టేకులైనా తీసుకుంటాడు.

### కన్నీటి చుక్క సరిగ్గా రావాలని..

కేవలం మా పర్ఫామెన్స్ కోసమే కాదు, వెనకాల పావురాలు ఎగిరే క్షణాలు కూడా సరిగ్గా రావాలనుకుంటాడు. అన్నీ సరిగ్గా కుదరాలని భావిస్తాడు. ఒక పాటలో నేను ఏడవాల్సి ఉంటుంది. ఆ పాటలోని ఓ లైన్ దగ్గర నా కన్నీటిచుక్క కిందపడాలి. దీని కోసం 28 టేకులు తీసుకున్నాను అని చెప్పుకొచ్చింది. ప్రదీప్ సర్కార్.. అనారోగ్యంతో 2023లో కన్నుమూశారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com